ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 8 జనవరి 2025


జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డులో పడకలను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర రెడ్డి, ఇతర అధికారులు

హెచ్‌ఎంపీవీ.. ఏం చేస్తుందో!?



- జిల్లావాసుల్లో మొదలైన వైరస్ కలవరం
- ప్రభుత్వ ఆదేశాలతో జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు
- ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లు వినియోగంలోకి తెచ్చేందుకు కసరత్తు

చైనాను కలవరపెడుతున్న 'హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ)' దేశంలోకీ ప్రవేశించి, ఐదు కేసులు నమోదయ్యాయన్న వార్తలతో జిల్లావాసుల్లోనూ గుబులు మొదలైంది. కర్ణాటక, గుజరాత్, తమిళ నాడులలో పాజిటివ్ కేసులు బయ టపడటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు నగరంలోని జీజీహెచ్‌లో ఇరవై పడకలతో కూడిన ప్రత్యేక వార్డును ఏర్పా టు చేశారు. ఇందులో ప్రత్యేక వైద్య బృందంతో పాటు అన్ని రకాల మందులను సమకూర్చారు. ఇక ఆక్సిజన్ ప్లాంట్లను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టా రు. కాగా, ఎక్కడా మరణాలు నమోదు కాకపోవటంతో ఎలాంటి ఆందోళన వద్దని వైద్య నిపుణులు భరోసా ఇస్తున్నారు.

కోడిపందేలు జరగనీయొద్దు

- ప్రత్యేక కమిటీలతో గ్రామాల్లో నిఘా
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మంగళవారం పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో జంతు హింస నివారణ చట్టం అమలుపై కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ కోడిపందేలు నేరమనే విషయంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు సభ్యులుగా గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి కోడి పందేలు జరగకుండా చూడాలని సూచించారు. నిబంధనలు అతి క్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పశుసంవర్థకశాఖ జేడీ రమేష్ నాయక్, ఏఎస్పీ సౌజన్య, డీఎఫ్‌వో మహబూబ్ బాషా, జడ్పీ సీఈవో విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి, పశుసంవర్థకశాఖ ఏడీ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలికి అరుదైన అవకాశం



- గణతంత్ర దినోత్సవంలో పాల్గొనాలని రాష్ట్రపతి భవనం ఆహ్వానం

నెల్లూరు (సిటీ), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని పారిశుధ్య (డ్రైనేజీ) కార్మికురాలు వనపర్తి జయమ్మకు అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 26వ తేదీన ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ ఆమెకు ఆహ్వాన పత్రిక వచ్చింది. ఈ మేరకు ఆ పత్రికను కమిషనర్ సూర్యతేజ మంగళవారం తన కార్యాలయంలో జయమ్మకు అందచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకంలో జయమ్మ లబ్ధిదారుగా సెప్టిక్ ట్యాంకు వాహనానికి యజమానిగా కొనసాగుతూ స్వయంకృషితో జీవిస్తూ ఆదర్శంగా ఉన్నారని తెలిపారు. ఈ విషయాన్ని కేంద్రం గుర్తించిందని చెప్పారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగే వేడుకల్లో పాల్గొనడంతోపాటు అక్కడ ఏర్పాటు చేసిన విందులో జయమ్మ పాల్గొంటుందని పేర్కొన్నారు.

వరిపైరుకు బీమా నమోదు గడువు 15 వరకు పెంపు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా వరి పంటకు బీమా ప్రీమియం నమోదు గడువును ఈ నెల 15వతేదీ వరకు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గడువు డిసెంబరు 31వతేదీతో ముగి సినప్పటికీ ప్రభుత్వం పక్షం రోజులు పొడిగించిందని తెలిపారు. హెక్టారుకు రూ.450 చొప్పున ప్రీమియం చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలని, పంట దిగుబడి తగ్గినప్పుడు బీమా ప్రయోజనం లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరాభవం నుంచి.. పైకి లేచేదెలా!?

- నేడు వైసీపీ నేతలతో జగన్మోహన్‌రెడ్డి భేటీ
- ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ
- తాడేపల్లికి తరలిన స్థానిక సంస్థల ప్రతినిధులు

సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాభవం తరువాత ఫలితాలపై విశ్లేషణకు, భవిష్యత్ కార్యాచరణ పట్ల క్యాడర్‌ను దిశానిర్దేశం చేయడానికి వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం సమావేశం కానున్నారు. తాడేపల్లిలో ఉదయం జరగనున్న ఈ సమావేశానికి వైసీపీకి చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొననున్నారు. అయితే ఇప్పటికే చాలా మంది వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్న నేపథ్యంలో ఎంత మంది ఈ సమావేశానికి హాజరవుతారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



నెల్లూరు (ఆంధ్రజ్యోతి), జనవరి 7 : 'ఒక్క చాన్స్' నినాదంతో జనంలోకి వచ్చిన జగన్‌కు జిల్లా ప్రజలు 2019 ఎన్నికల్లో బ్రహ్మ రథం పట్టారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని పదికి పది అసెంబ్లీ స్థానాలను కట్టబెట్టారు. ఆ తరువాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అధికార పార్టీ నాయకులు ప్రజల ప్రమేయం లేకుండా ఫలితాలను ఏకపక్షం చేసుకున్నారు. ఆ క్రమంలో జిల్లాలోని అన్ని జడ్పీటీసీ, ఎంపీపీ, 99 శాతానికిపైగా ఎంపీటీసీ స్థానాలు, మున్సిపాలిటీల్లోని కౌన్సిలర్, కార్పొరేటర్ స్థానాలు వైసీపీపరం అయ్యాయి. ఒకవిధంగా చెప్పాలంటే ఈ ఎన్నికలు జరిగిన తీరే ప్రజల్లో వైసీపీ పట్ల వ్యతిరేక భావనకు తొలి బీజం పడిందని రాజకీయ పరిశీలకుల వాదన. ఇలా రెండున్నరేళ్ల క్రితం ప్రజల్లో మొదలైన వైసీపీ వ్యతిరేకభావం ఆ తరువాతి కాలంలో విపరీతంగా బలపడింది. వైసీపీ ఎమ్మెల్యేల బహిరంగ అవినీతి, దౌర్జన్యాలు, రాజకీయ కక్ష సాధింపులు, వేధింపులు, ప్రతిపక్షాల సానుభూతిపరులపై నమోదు చేయించిన తప్పుడు కేసులు.. ఇవన్నీ జగన్ బటన్ నొక్కుడు కార్యక్రమం వల్ల కలిగే ప్రయోజనాన్ని మింగేశాయి. ఒక వైపు నామమాత్రంగా కూడా జరగని అభివృద్ధి, మరోవైపు ఐదేళ్ల కాలంలో కొండలా పెరిగిన వైసీపీ నాయకుల ఆర్థిక స్థితి.. మరో వైపు ప్రతి ఒక్కరిలో అభద్రతా భావన, నోరుమెదపలేని నిరంకుశ పరిస్థితులు ఓటింగ్‌పై తీవ్ర ప్రభావం చూపాయి.

● నాయకుల్లో నిరాశ

ప్రజల పరిస్థితి ఇలా ఉంటే వైసీపీలోని ద్వితీయ శ్రేణి నాయకుల పరిస్థితి మరీ దయనీయం. ఐదేళ్ల కాలంలో ఏనాడు వీరికి జగన్ దర్శనం లభించలేదు. అడపదడపా సభలు, సమావేశాలకు జిల్లాకు వచ్చినా పరదాల మాటున చేతులూపి వెళ్లారే కానీ ఏ నాయకుడినీ దగ్గర తీసుకొని మాట్లాడిన సందర్భం లేదు. వైసీపీ కోసం ఎంత చేసినా అగ్రనేత దృష్టిలో పడలేమనే నిర్ణయానికి వచ్చిన పలువురు నాయకులు ఎన్నికలకు ముందే పోలేమని తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. మిగిలిన వారిలో చాలా మంది ఎన్నికల తరువాత టీడీపీలో చేరిపోయారు. ఈ క్రమంలో స్థానిక సంస్థల్లో వైసీపీ సంఖ్యా బలం గణనీయంగా తగ్గిపోయింది. పార్టీ క్యాడర్ ఇంతగా బలహీనపడిన తరువాత ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి మేలుకున్నారు. జిల్లాలో ఆ పార్టీకి తిరిగి పూర్వవైభవం తేవాలనే అత్యాశతో బుధవారం జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీలతో తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సమావేశం అవుతున్నారు. ఇది ఎంత వరకు ఫలప్రదం అవుతుందో వేచి చూడాల్సిందే.

'రెడ్‌క్రాస్' కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా!
- సభ్యుడిగానే కొనసాగుతా
- నా రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కుట్ర
- ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి సంచలన ప్రకటన

- వివరాలు 6లో..


కావలి-తుమ్మలపెంట రోడ్డు ఇది. ఒకప్పుడు ఈ రోడ్డుపై ప్రయాణమంటే నరకమే. ఎందరో వాహనదారులు రోడ్డు మీదున్న గుంతల్లో పడి ఒళ్లు హూనం చేసుకున్నారు. 2020లో ఈ రోడ్డును ఎన్డీబీ ప్రాజెక్టు కింద బాగు చేయాలని టెండర్లు పిలిచారు. కానీ నాడు కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోతుండటం, ఇదే కాంట్రాక్టర్‌కు వేరే వర్కులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో పనులు జరగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక బిల్లులు ఇవ్వడం మొదలుపెట్టారు. దీంతో కాంట్రాక్టర్ కూడా తుమ్మలపెంట రోడ్డు పనులు ప్రారంభించారు. 9 కి.మీ పొడవున రోడ్డును విస్తరించి అభివృద్ధి చేస్తున్నారు. రూ.14 కోట్లతో మొదలైన ఈ పనులు నాలుగు నెలల నుంచి వేగంగా జరుగుతున్నాయి.


మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనంలో జరుగుతున్న పనులివి. 2020, నవంబరులో నాడు-నేడు పథకం కింద రూ.1.7 కోట్లతో శిలాఫలకం ఆవిష్కరించి, పనులు ప్రారంభించారు. అయితే, బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పీహెచ్‌సీ పనులు మొదలయ్యాయి. పెండింగ్ బిల్లులు చెల్లిస్తుండటంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ధైర్యంగా ముందుకొచ్చారు. ప్లాస్టింగ్, ఎలక్ట్రికల్ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. మార్చిలోపు పీహెచ్‌సీని పూర్తి చేసే విధంగా అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు.

బిల్లులకు మోక్షం.. ప్రగతికి బాట!

- అభివృద్ధి పనులకు వీడిన గ్రహణం
- బకాయిలు చెల్లిస్తున్న కూటమి ప్రభుత్వం
- ఊపిరి పీల్చుకుంటున్న కాంట్రాక్టర్లు
- పనులు చేసేందుకు ఆసక్తి

సరిగ్గా 7 నెలల క్రితం వరకూ ప్రభుత్వ పనులంటే కాంట్రాక్టర్లు ఆమడ దూరం పారిపోయేవారు. ఏదైనా వర్కుకు టెండర్లు పిలిచారంటే ఒక్కరంటే ఒక్కరు కూడా బిడ్ వేసేవారు కాదు. ఒకరిద్దరు అప్పటికే పనులు దక్కించుకొని ఉన్నా వాటిని మొదలుపెట్టేందుకు సాహసించేవారు కాదు. కొందరు కాంట్రాక్టర్లయితే కొద్దిగా పనులు చేశాక ఆపేశారు. వీటిని పూర్తి చేయమని ఎవరెన్ని ఒత్తిళ్లు తెచ్చినా ససేమిరా అన్న సంఘటనలు నాడు కనిపించేవి. అధికారులు కూడా గట్టిగా మాట్లాడలేని పరిస్థితి. ఆఖరుకు రోడ్లపై భారీ గుంతలు ఏర్పడినా.. వాటిని అత్యవసరంగా పూడ్చేందుకు కూడా కాంట్రాక్టర్ దొరికేవారు కాదు. దీనంతటికీ ఒక్కటే కారణం.. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడమే. వైసీపీ ప్రభుత్వం అవలంబించిన తీరు నాడు కాంట్రాక్టర్లనే కాకుండా ప్రజలను కూడా తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. రోజుల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో అన్ని శాఖల్లోనూ పనులు చేసే వారు కరువయ్యారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిస్థితులు క్రమేణా మారిపోతున్నాయి. అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం, ఆ క్రమంలోనే పెండింగ్ బిల్లులు చెల్లిస్తుండడంతో కాంట్రాక్టర్లలో మళ్లీ ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతోంది. ఇప్పుడిప్పుడే పనులు చేసేందుకు ముందుకొస్తున్నారు.

● జోరందుకున్న పనులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులపై దృష్టి సారించడంతో కాంట్రాక్టర్లకు మంచి రోజులొచ్చాయి. ఇకపై పనులు జరగాలంటే పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందేనని నిర్ణయించుకున్న ప్రభుత్వం.. ఇటీవల పెండింగ్ బిల్లులను ప్రాధాన్యతా క్రమంలో చెల్లిస్తూ వస్తోంది. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల్లో కాంట్రాకర్లలో ఒక్కొక్కరికి కొద్ది కొద్దిగా పేమెంట్లు జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వ పనులు చేసేందుకు మళ్లీ కాంట్రాక్టర్లు ఆసక్తి చూపుతున్నారు. టెండర్లు వేసేందుకు కూడా పోటీ పడుతున్నారు. ఇటీవల ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల్లో పిలిచిన టెండర్లే ఇందుకు నిదర్శనం. ఒక్కో వర్కుకు నలుగురు, ఐదుగురు వరకూ బిడ్లు దాఖలు చేయడంతో అధికార వర్గాలు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయి. టెండర్లు వేయడమే గాక వెంటనే పనులు కూడా చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో గుంతలు పూడ్చడం, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో సిమెంటు రోడ్లు వేయడమే ఇందుకు ఉదాహరణ. కాగా కొత్త పనులేగాక గతంలో పెండింగ్‌లో ఉన్న పనులకు కూడా మోక్షం లభిస్తోంది. నాడు బిల్లులు రాక అర్ధంతరంగా ఆపేసిన పనులను తిరిగి ప్రారంభిస్తున్నారు. న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్డీబీ) ప్రాజెక్టు కింద చేపట్టిన పనులు, సీఆర్ఐఎఫ్ కింద టెండర్లు పిలిచి ఉన్న పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. ఇరిగేషన్ పరిధిలో కూడా జైకా వర్కులు మొదలయ్యాయి. ఇదే మాదిరిగా అన్ని శాఖల్లోనూ అభివృద్ధి పనులు జోరందుకుంటున్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

హోరా హోరీగా
క్యారమ్స్ పోటీలు

నేడు ఫైనల్స్

నెల్లూరు(విద్య), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు క్లబ్‌లో అఖిల భారత ఫెడరేషన్ కప్ క్యారమ్స్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. మూడో రోజు మంగళవారం విరామం సమయానికి పురుషులు, మహిళల డబుల్స్ మ్యాచ్‌లు సెమీఫైనల్స్ ముగించుకుని ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. సింగిల్స్ మ్యాచ్‌లు మూడో రౌండ్ జరుగుతున్నాయి.

సెమీ ఫైనల్స్ విజేతలు

పురుషుల డబుల్స్ విభాగంలో ఆర్‌బీఐకు చెందిన జహీర్ పాషా-ప్రశాంత్ మోర్‌లు జైన్ ఇరిగేషన్‌కు చెందిన రహీమ్ కరీంఖాన్-అభిజి త్ త్రిపాంకర్‌పై, మహారాష్ట్రకు చెందిన వికాస్ హరీష్ ధరియా-పంకజ్ అశోక్ పవార్‌లు జైన్ ఇరిగేషన్‌కు చెందిన సందీప్‌డైవ్-జైద్ అహ్మద్ ఫరూకీలపై విజయం సాధించారు. మహిళల డబుల్స్ విభాగంలో తమిళ నాడుకు చెందిన శోభిక-ప్రీతి ప్రిన్సెస్‌లు పీఎస్‌పీబీకు చెందిన రష్మీ కుమారి-ఇలవాం జిలపై, పీఎస్‌పీబీకి చెందిన ఎం.ఖాజి మా-మిత్రలు సీసీసీ ఎస్‌బీకి చెందిన నాగజ్యోతి-నీలం మోడ్కేలపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నారు.



ఉత్కంఠగా జరుగుతున్న క్యారమ్స్ పోటీలు

సింగిల్స్ విభాగంలో..

సింగిల్స్ పురుషుల విభాగంలో ఎల్ఐసీకి చెందిన ఢిల్లీబాబు పీఎస్‌పీబీకి చెందిన టాప్ సీడెడ్ ఎండి. ముఫ్రాన్‌పై, పీఎస్‌పీబీకి చెందిన పి.శ్రీనివాస్ బీఏఎస్ సీబీకి చెందిన ధర్మేంద్రకుమార్‌పై, విదర్భకు చెందిన ఇర్షాద్ అహ్మద్ యూపీకి చెందిన అలీఅబ్బాస్‌పై, ఢిల్లీకి చెందిన ఎండి.షాదాద్ ఏపీకి చెందిన ఉమామహేశ్వర రావుపై, సీఏజీకి చెందిన వి.అనిల్‌కుమార్ ఏఏఐకు చెందిన ముషారఫ్‌పై, ఆర్‌బీఐకు చెందిన ప్రశాంత్‌మోర్ డీఏఎస్‌సీసీఎస్‌బీకి చెందిన ఆర్.ప్రజో య్‌పై విజయం సాధించారు. మహిళల సింగిల్స్ విభాగంలో పీఎస్‌పీ బీకి చెందిన రష్మీకుమారి రాజస్థాన్‌కు చెందిన సీమా చౌహాన్‌పై, గుజ రాత్‌కు చెందిన వానిష్రుతి ఏపీకి చెందిన సీహెచ్.సుధపై, ఏఏఐకు చెందిన నిధిగుప్తా తెలంగాణకు చెందిన నాగజ్యోతిపై, తమిళ నాడుకు చెందిన ఎల్.కీర్తన డీఏఎస్‌సీబీకి చెందిన అంజలి ప్రజాపతిపై, తమిళ నాడుకు చెందిన బి.శోభిత ఆర్‌బీఐకు చెందిన కవిత సోమంచిపై గెలుపొందారు.

10న జిల్లా హాకీ జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), (ఆంధ్ర జ్యోతి) : జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 10వతేదీన సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ పురుషులు, మహిళల హాకీ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వీ జగన్‌మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంబంధిత తేదీలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

- ఉపాధి పనుల బాధ్యత వారికే...
- ఎంపికకు అధికారుల కసరత్తు

శ్రమశక్తి సంఘాలకు
పునరుజ్జీవం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

ఉదయగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో వచ్చేనెల ఒకటి తేదీ నుంచి శ్రమశక్తి సంఘాలు కీలకం కానున్నాయి. పనికి దరఖాస్తు చేసుకోవడం, పనుల కేటాయింపులు, మస్టర్ల డౌన్‌లోడ్, పూర్తి చేసిన పనులకు కొలతలు వంటివి ఇకపై పక్కాగా అమలు కానున్నాయి. బాధ్యులుగా సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు వ్యవహరించనున్నారు. ఈ నేపథ్యంలో ఈనెలాఖరులోపు మండలాల్లో శ్రమశక్తి సంఘాలు, మేట్ల ఎంపిక పూర్తి చేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ ఆయా కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి 50 జాబ్‌కార్డులకు ఒక సంఘంగా ఏర్పాటు చేయడంతోపాటు మేటీని ఎంపిక చేయాల్సి ఉంది. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ సంఘాలు ఉండగా వైసీపీ వాటిని నిర్వీర్యం చేయడంతో మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నారు.

● 50 జాబ్‌కార్డులకు ఒక సంఘం

జిల్లాలోని 721 పంచాయతీల్లో 2.78 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 4.38 లక్షల మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం రోజుకు సుమారు లక్ష మంది కూలీలు పని చేస్తున్నారు. ప్రతి 50 జాబ్‌కార్డులకు ఒక సంఘం ఏర్పాటు చేయడంతో పాటు కమిటీని ఎంపిక చేయాల్సి ఉంది. గత టీడీపీ హయాం లో ఉన్న శ్రమశక్తి సంఘాలను పునరు ద్ధరించ నున్నారు. సంఘాలు ఏర్పాటైతే ఏడాదిపాటు ఏలాంటి మార్పు ఉండదు. సభ్యులు కమిటీని ఎంపిక చేసుకుని సమా చారాన్ని క్షేత్రసహాయకులకు అందించాల్సి ఉంటుంది. మేట్లు కచ్చితంగా 2023-24 సంవత్సరంలో వంద రోజుల పనిని విధిగా 25 రోజులు చేసి ఉండాలి. సంఘ సభ్యుడిగా ఉండడంతోపాటు 50 ఏళ్లలోపు ఉండాలి. చదవడం, రాయడం తెలియడంతో పాటు సొంత సెల్‌ఫోన్ కలిగి ఉండాలి.

త్వరగా పూర్తి చేస్తాం

శ్రమశక్తి సంఘాల ఎంపిక త్వరిగా పూర్తి చేస్తాం. సంఘాల ఎంపిక పూర్తి చేయాలని ఇప్పటికే అందరికీ సూచించాం. అందరి ఆమోదంతో మేట్లను ఎంపిక చేస్తాం.

- గాయత్రిదేవి, ఏపీడీ, ఉదయగిరి

వ్యవసాయం తప్ప మరో ప్రపంచం తెలియని ఓ కుగ్రామం అది. ఇంకా చెప్పాలంటే సేద్యానికి కూడా సమృద్ధిగా భూమిలేని నిరుపేద గ్రామం. ఒకనాడు పుట్టిన నాటినుంచి చనిపోయేవరకు ఊరుదాటి వెళ్లని వారు ఈ గ్రామంలో ఎంతోమంది ఉండేవారు. అతి కొద్దిమంది మాత్రమే నెలకో, రెండు నెలలకో తమ అవసరాల కోసం సమీపంలోని కందుకూరుకు వెళ్లి వచ్చేవారు. ఊరే ప్రపంచంగా బతికిన ఆ గ్రామస్థులు నేడు దేశ, విదేశాలలో స్థిరపడ్డారు. అంతేకాదండోయ్! మనదేశంలో ఏ నగరానికి వెళ్లినా ఒక్కరైనా ఆ ఊరివాళ్లు ఉంటారు. ఆ గ్రామమే కందుకూరుకు 7 కి.మీ దూరంలో ఉన్న వలేటివారిపాలెం మండలం అత్తంటివారిపాలెం.



అత్తంటివారి గ్రామం ఏరియల్ వ్యూ

ఆ ఊళ్లో
ప్రతి ఇంటా ఉద్యోగే!

కందుకూరు, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): రెవెన్యూ రికార్డులలో ఈ గ్రామం పేరు నేకునాంపురం అయినా అత్తంటివారిపాలెం అంటేనే అందరికీ తెలుస్తుంది. 200 వ్యవసాయ కుటుంబాలు, మరో 200 వ్యవసాయ కూలీ కుటుంబాలు నివసించే ఈ గ్రామంలో అంతా సన్న, చిన్నకారు రైతులే. వ్యవసాయ కుటుంబాలలో 90 శాతం కుటుంబాలకు ఎకరం, రెండు ఎకరాల భూమే జీవనాధారం. మిగిలిన పదిశాతంలో ఐదుశాతం మందికి ఐదారు ఎకరాలు, మరో ఐదు శాతం మందికి పది, పదిహేను ఎకరాల భూమి ఉంది. ఆ కొద్దిపాటి భూమితోనే వ్యవసాయం చేసుకుం టూ తాము జీవించ డమే గాక తమపై ఆధారపడి ఉన్న వ్యవ సాయ కూలీ కుటుంబాలకు కూడా ఉపాధి కల్పిస్తున్నారు. ఉన్నది కొద్ది భూమే అయినా విభిన్నమైన పంటలు పండించడం, ఏడాది పొడవునా శ్రమిస్తూ ఒకటికి రెండు పంటలు పండించటం ద్వారా అత్తంటివారిపాలెం గ్రామస్థులు చుట్టుపక్కల గ్రామాల వారికి ఆదర్శంగా నిలిచే వారు. అలాంటి గ్రామంలో నేడు ప్రతి ఇంట్లో కనీసం ఒక ఉద్యోగి ఉండగా ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు ఉన్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి.

అనేక రంగాల్లో స్థిరపడి..

ఒక్క మాటలో చెప్పాలంటే గత మూడు దశాబ్దాల తర్వాత జన్మిం చిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఉద్యోగంలో చేరి నగరాలలో స్థిరపడటం విశేషం. కేవలం ఉద్యోగులుగానే కాక విద్య, వ్యాపార, రాజకీయ రంగాల్లోనూ ఉన్నత స్థితిలో ఉన్నారు. కందుకూరులో ప్రఖ్యాతి గాంచిన ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించిన కంచర్ల రామయ్యది ఈ గ్రామమే. కందుకూరులో ప్రముఖ వ్యాపారవేత్తగా గుర్తింపు పొందిన కొల్లూరు కొండయ్య ఈ గ్రామవాసే. తూర్పు రాయలయసీమ ఎమ్మెల్సీగా, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి, ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న కంచర్ల శ్రీకాంత్ ఈ గ్రామవాసే. 60 సంవ త్సరాల క్రితం 1965లో సీఏ పూర్తి చేసిన ఉన్నం గోపాల్ ఈ గ్రామం నుంచి బయటకి వెళ్లిన తొలి ఉద్యోగిగా గుర్తింపు పొందారు. ఆ తర్వాత ఇరిగేషన్ శాఖలో ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించిన రెండో వ్యక్తిగా కంచర్ల వెంకటేశ్వర్లు పేరు గడించారు. అనంతరం ఈ గ్రామవాసి కంచర్ల సుబ్బారావు లెక్చరర్‌గా, పోకూరి మాలకొండయ్య ఉపాధ్యాయుడిగా, కంచర్ల సుధాకర్ ఇంజనీర్‌గా ఉద్యోగాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. వారిని ఆదర్శంగా తీసుకొని విద్య ఒక్కటే తమ జీవితాన్ని మార్చుతుందని గుర్తించిన ఆ గ్రామ యువత కష్టపడి చదువుకోగా తల్లిదండ్రులు కూడా రెక్కల కష్టంతో చదివించి వారి ఉన్నతికి తోడ్పాటు అందించారు.



గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయం

విదేశాల్లోనూ కొలువులు

1998లో కంచర్ల కృష్ణారావు అనే యువకుడు అమెరికా వెళ్లగా ప్రస్తుతం 8 మంది అమెరికాలోనూ, ముగ్గురు లండన్‌లో, ఇద్దరు ఆస్ట్రేలియాలో ఉద్యోగాలు చేస్తున్నారు. అలాగే దేశంలో ప్రఖ్యాత నగరాలన్నింటిలో ఈ గ్రామస్థులు ఒకరిద్దరైనా ఉండగా బెంగళూరు, హైదరాబాదు, చెన్నైలో అనేక మంది ఉద్యోగాలు చేస్తుండటమే కాగా ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఉన్నత స్థానాలలో ఉంటున్నారు. ఒకరకంగా చెప్పాలంటే తమ తల్లిదండ్రులు పడ్డ కష్టం ప్రత్యక్షంగా చూడటం, చిన్నప్పుడు మాకూ పెద్దవాళ్లతో కలిసి పనిచేయక తప్పని పరిస్థితులే మమ్మల్ని పట్టుదలగా చదువుకునేలా ప్రోత్సహించాయని ఆ కష్టాలే తమను ఉన్నతంగా స్థిరపడేలా చేశాయని ఆ గ్రామ యువకులు చెబుతుంటారు.

గ్రామ అభివృద్ధికీ పాకులాట

ఎక్కడ ఉన్నా సొంతూరి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. గ్రామంలోని ఉద్యోగులంతా తమ శక్తిమేరకు చందాలు వేసుకుని ఇటీవల రమారమి రూ.2 కోట్లతో గ్రామంలో రామాలయం నిర్మించారు. అలాగే గ్రామదేవత పోలేరమ్మ ఆలయ నిర్మాణానికీ తమవంతు తోడ్పాటు అందించారు. గ్రామంలో స్మశానవాటిక అభివృద్ధికి పూనుకుని కృషి చేస్తున్నారు. గ్రామాభివృద్ధితోపాటు గ్రామస్థులకూ వ్యక్తిగతంగా తోడ్పాటు అందించేందుకు ముందుకు వస్తున్నారు. ఏటా సంక్రాంతికి గ్రామానికి చేరుకొని అందరితో కలిసిమెలిసి సందడి చేస్తూ భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

విజన్2020 ఫలితమే



మా గ్రామంలో ప్రతి ఇంట్లో ఒకరిద్దరు ఉద్యోగులు ఉన్నారంటే అది విజన్ 2020 ఫలితమేనని నా అభిప్రాయం. ఒకప్పుడు అంతా నిరక్షరాస్యులై నప్పటికి ముందు తరంలో ఉద్యోగాలు సాధించిన వారి జీవనశైలి స్ఫూర్తితో ప్రతిఒక్కరు చదువుకోవడం విజన్ 2020 ఫలితాలను అందిపుచ్చుకోవడంతో ఈ మార్పు సాధ్యమైంది.

- కంచర్ల రామయ్య, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజి కరస్పాండంట్

ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా అభివృద్ధి సాధించాలి



గ్రామం నుంచి వివిధ రంగాల్లో ఎంతో మంది స్థిరపడి నందున భవిష్యత్‌లో కేవలం ఉద్యోగులుగా కాకుండా ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా అభివృద్ధి చెంది మరికొందరికి ఉపాధి కల్పించాలన్నదే అభిలాష. అలాగే యూపీఎస్‌సీ పరీక్షలకు సిద్ధపడటం ద్వారా ఐఏఎస్, ఐపీఎస్‌లు కూడా మా గ్రామం నుంచి వచ్చేలా యువతను ప్రోత్సహిస్తాం.

- కంచర్ల సుధాకర్, బీటెక్, ఎంబీఏ

అభివృద్ధికీ బాధ్యత తీసుకున్నాం



మా గ్రామంలో నిరుపేదల సంక్షేమం, గ్రామాభివృద్ధి కోసం కూడా మేము బాధ్యత తీసుకుంటున్నాము. ఆర్థిక స్తోమతలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలలో వైద్య ఖర్చులకు తోడ్పాటు అందించడంతోపాటు ప్రైవేటు ఆసు పత్రిలలోనూ వారికి ఉచిత సేవలు అందేలా సొంత డబ్బు ఖర్చు చేస్తున్నాము. అలాగే విద్యను మరింతగా ప్రోత్సహించాలనే లక్ష్యంతో మెరిట్ విద్యార్థులకు ఏటా ప్రోత్సాహకాలు అందచేస్తున్నాము.

కంచర్ల నరసింగరావు, సీఏ, ఖతార్

హెచ్‌ఎంపీవీ..
ఏం చేస్తుందో!?

- దేశంలో వైరస్ విస్తృతి మొదలు
- జిల్లావాసుల్లో మొదలైన కలవరం
- పాత వైరస్సే.. ఆందోళన వద్దంటున్న వైద్య నిపుణులు
- కూటమి ప్రభుత్వం అప్రమత్తం.. వైద్య శాఖకు కీలక ఆదేశాలు
- జీజీహెచ్‌లో 20 పడకల ఏర్పాటు
- ప్రత్యేక వైద్యబృందం నియామకం
- ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను పరిశీలించిన అధికారులు

నెల్లూరు (వైద్యం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :కరోనా మహమ్మారి బారినపడి కుటుంబ సభ్యులను కోల్పోయిన జిల్లా ప్రజలలో ఈ కొత్త హెచ్‌ఎంపీవీపై అనేక అనుమానాలు ఉన్నాయి. ప్రస్తుతం చిన్నపిల్లలకు మాత్రమే వైరస్ సోకుతుండగా, 40 ఏళ్ల పైబడి రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారూ దాని బారిన పడే అవకాశం ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. అయితే ఇది పాత వైరస్సేనని 2001లో గుర్తించిన కామన్ రెస్పిరేటరీ వైరస్ అని ఇది అన్ని వయస్కుల వారికి వస్తుందని మరికొందరు వైద్యులు చెబుతున్నారు. చలికాలంలో ఈ హెచ్‌ఎంపీవీ ఇన్ఫెక్షన్ కేసులు పెరుగుతుంటాయని అంటున్నారు. కరోనాలా అంతటి ప్రభావం ఈ హెచ్‌ఎంపీవీకి లేదని దీనిపై ఆందోళన అవసరం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ప్రకటించింది. సాధారణంగా జలుబు చేస్తే ఎలాంటి లక్షణాలు ఉంటాయో హెచ్‌ఎంపీవీ లక్షణాలు కూడా అలాగే ఉంటాయి. అయితే ప్రజల్లో మాత్రం ఈ వైరస్‌పై ఆందోళన మొదలయింది.

● జీజీహెచ్‌లో 20 పడకలు

హెచ్‌ఎంపీవీ వ్యాపిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆదేశాలతో నెల్లూరులోని ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) మంగళవారం 20 పడకలు ఏర్పాటు చేశారు. పది పడకలలో అనుమానిత వ్యాధిగ్రస్థులు, మరో పది పడకలతో వ్యాధి నిర్ధారణ అయిన వారి కోసం కేటాయించారు. వెంటిలేటర్లతోపాటు అత్యవసర మందులు అందుబాటులో ఉంచుతున్నారు. యాంటిబయాటిక్ మందులను అందుబాటులోకి తెస్తున్నారు. కరోనా తరహాలో జీజీహెచ్‌లో వైద్యసేవలు అందించేందుకు అన్ని సదుపాయాలను సమకూర్చుతున్నారు. అలాగే ప్రత్యేక వైద్యబృందాన్నీ ఏర్పాటు చేస్తున్నారు.



హెచ్‌ఎంపీవీ బాధితుల కోసం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు

ప్రత్యేకించి ఈ వ్యాధి ఊపిరి తిత్తులపైనే ప్రభావం చూపిస్తుండటంతో ఆ వైద్య నిపుణులతో పాటు జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులను ప్రత్యేకంగా నియమించారు.

● ఆక్సిజన్ ప్లాంట్‌ల పరిశీలన

హెచ్‌ఎంపీవీ బాధితులకు ప్రధానంగా ఆక్సిజన్ అవసరం కావటంతో ముందస్తు జాగ్రత్తగా జీజీహెచ్‌లో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్‌లను డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. గాలి ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి చేసే రెండు కిలో లీటర్ల ఆక్సిజన్ ప్లాంట్‌ను పరిశీలించి, మరో ప్లాంట్‌లో ఆక్సిజన్ ఉత్పత్తి లేకపోవటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆక్సిజన్ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.



ఆక్సిజన్ ప్లాంట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర రెడ్డి

ఆందోళన వద్దు



హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ఎలాంటి ఆందోళన అవసరం లేదు. మామూలు జలుబు, దగ్గు వంటి వ్యాధులతోపాటు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు జాగ్రత్తలు పాటించాలి. ఇన్ఫ్లూయంజా వ్యాక్సిన్ వేసుకుంటే ఊపిరితిత్తుల వ్యాధులు నివారించవచ్చు. వయసు ఎక్కువగా ఉన్న వారు, ఆస్తమా, సీవోపీడీ బాధితులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలి.

- డాక్టర్ పోకల రవి, రవి చెస్ట్ ఆసుపత్రి

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



కొవిడ్ తరహాలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. హెచ్‌ఎంపీవీ బాధితుల కోసం ఇప్పటికే 20 పడకలు సమకూర్చాము. నిరంతర వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాన్ని నియమించాము. అన్ని రకాల మందులు కూడా అందుబాటులో ఉంచుతున్నాం. అత్యవసర మందులు కొనుగోలుకు ప్రత్యేక దృష్టి పెట్టాం. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధంగా ఉన్నాము.

- డాక్టర్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్, జీజీహెచ్

రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ పదవికి
చంద్రశేఖర్‌రెడ్డి రాజీనామా

- నా రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక మంత్రి నారాయణ కుట్ర
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు (వైద్యం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఎమ్మెల్సీ పర్వ తరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని రాష్ట్ర కమిటీకి పంపిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడ్‌క్రాస్‌లో సేవే పరమావధిగా పనిచేస్తున్న తాను రాజకీయంగా ఎదగడాన్ని చూసి ఓర్వలేకే పురపాలక మంత్రి నారాయణ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తోటి సభ్యులతో అనేక దఫాలు మంత్రి మాట్లాడారని, తనను రెడ్‌క్రాస్ చైర్మన్ పదవి నుంచి దించాలని ఒత్తిడి చేశారన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ 13 విభాగాలుగా ఎంతో అభివృద్ధి చెందు తున్న దశలో అనేక ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని ఈ నెలాఖరులో చైర్మన్‌గా రాజీనామా చేస్తానని సంకేతాలు పంపినా మంత్రి రెడ్‌క్రాస్ రాష్ట్ర నేతలపై ఒత్తిడి తెచ్చారని విమర్శించారు. ఈ క్రమంలోనే రెడ్‌క్రాస్‌లో రాజకీయ నాయకులు ఉండరాదని రాష్ట్ర కమిటీ ఓ ప్రకటన విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో ఎన్నో జిల్లాల్లో అధికార పార్టీ నేతలే రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ చైర్మన్లుగా ఉన్నారని చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. నారాయణ ఆసుపత్రిలో కేన్సర్ విభా గాన్ని ఏర్పాటు చేస్తున్నారని, అయితే అక్కడ రేడియేషన్ విభాగం ఏర్పాటు ఆలస్యమవుతోందని తెలిసి రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రితో ఎంవోయూ కుదర్చుకునేందుకు ప్రయత్నించారన్నారు. ఇందుకు రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి ససేమిరా అనడంతో తనపై పగబట్టారన్నారు. వైసీపీకి ఎక్కువ సమయం కేటాయించాలన్న ఉద్దేశంతో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. ఇక నుంచి రెడ్‌క్రాస్ కమిటీ సభ్యునిగా కొనసాగుతానని స్పష్టం చేశారు.



రాజీనామా పత్రం చూపుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

పోలీసు పరీక్షలకు
462 మంది హాజరు

నెల్లూరు(క్రైం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో మంగళవారం ఉదయం 5 గంటల నుంచే పరీక్షలు ప్రారంభించారు. 600 మంది అభ్యర్థులకుగాను 462 మంది హాజరయ్యారు. వారిలో 387 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఎస్పీ కృష్ణకాంత్ దేహ దారుఢ్య పరీక్షలను పర్యవేక్షించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు

అవగాహన సదస్సులో ఎల్‌డీఎం ప్రదీప్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 7 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో ప్లాట్ కొనుగోలు చేసిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వెంటనే రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఎల్‌డీఎం(లీడ్ బ్యాంక్ మేనేజర్) ప్రదీప్ తెలిపారు. ఈ రుణాల మంజూరుపై మంగళవారం నెల్లూరు ఏకే నగర్‌లోని ఏపీఐఐసీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రదీప్ మాట్లాడుతూ రుణాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఐఐసీ డీజెడ్‌ఎం వెంకట సురేష్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు అవస రమైన అన్నీ అనుమతులు వెంటనే ఇచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఏడీ శ్రీనివాస్, కోఆర్డినేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద సూచిక బోర్డు ఏదీ?

గౌరవరం హైవే నుంచి గ్రామాలకు వెళ్లే సర్వీసు రోడ్డు డివైడర్ అయిన ప్రాంతం వద్ద అధికారులు ఎలాంటి సూచిక, ప్రమాద హెచ్చరిక బోర్డులు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయలేదు. ఈ సమస్యతో జాతీయ రహదారిపై వెళ్లే సమయంలో ప్రమాదాలకు గురిఅవుతున్నారు. రాత్రి సమయంలో వాహనాల లైట్ల వెలుతురుకు డివైడర్ గుర్తించలేక పోతున్నామని వాపోతున్నారు. హైవే అధికారులు స్పందించి గ్రామాల సర్వీస్ రోడ్ల కలిసే కూడళ్లలో ప్రమాదసూచిక బోర్డులు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి)



సల్లంగా చూడమ్మా.. పోలేరమ్మ

స్థానికంగా వెలసిన పోలేరమ్మ తిరునాళ్ల మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకంతో పాటు గ్రామ పూజ, ఆచార సంప్రదాయం ప్రకారం కొమ్మలోళ్ల ద్వారా పోలేరమ్మ కథా కార్యక్రమం, ముద్రగడ పావనము, అఖండ ప్రతిష్ఠ అనంతరం బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించి భక్తులను దర్శనానికి వదిలారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి చల్ది కుండల్లో నైవేద్యం తెచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పోతురాజుకు నైవేద్యంగా సమర్పించారు. తిరునాళ్లలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు పలగాటి శ్రీనివాసులు రెడ్డి, మేడా రామకృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)



నాటుసారాపై ఉక్కుపాదం

- రెండు నెలల్లో సారా తయారీ, విక్రయాలపై 55 కేసులు
- పాత నిందితులు 30మందిపై బైండోవర్
- జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారుల ప్రత్యేక దృష్టి
- 37 లీటర్ల సారా స్వాధీనం.. 500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

బిట్రగుంట, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గ పరిధిలో గత ఐదేళ్ల వైసీపీ అధికారంలో ఉన్నపుడు ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహించేంది. ఈ సమయంలో నాటుసారా తయారీ, నాటుసారా అమ్మకాలు గ్రామాల్లో ఎక్కడా కన్పించేవి కావు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడిచిన మూడునెలల కాలంలో గ్రామాల పరిధిలో నాటుసారా తయారీ కేంద్రాలు, అమ్మకాలు ఎక్కువ అయ్యాయి. మద్యం అమ్మకాలు ప్రైవేటు పరం అయిన తరువాత రోజురోజు పెరగడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ పాలనలో పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు టీడీపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో వీరికి బాధ్యతలు అప్పగించడంతో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు నాటుసారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గత రెండునెలల నుంచి సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచారు. గ్రామాల్లో దాడులు చేపడుతున్నారు. గత రెండు నెలల నుంచి ఈ అమ్మకాలు చేపట్టే వారిపై 55కేసులు నమోదు చేసి 55 మందిని అరెస్టు చేశారు.



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు



నాటుసారా విక్రయదారుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సీఐ

బోగోలు మండలంపై ప్రత్యేక దృష్టి..

ప్రధానంగా నియోజకవర్గంలోని బోగోలు మండలంలో ఈ సమస్య ఎక్కువగా ఉండటంతో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులకు వీటి అరికట్టడం సవాలుగా మారింది. కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు, ఎస్సై దేవిక సిబ్బందితో గతేడాది నవంబరు నెల నుంచి కొత్త సంవత్సరం జనవరి మొదటివారం వరకు 37లీటర్ల నాటుసారాను విక్రయదారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. 500 లీటర్లకుపైగా సారా తయారీ కోసం నిల్వ ఉంచిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఇప్పటికే నాటుసారా తయారు లోని పాత నిందితులు 30మందిని బైండోవర్ చేశారు. కావలి ఎక్సైజ్ అధికారులు బోగోలు మండలంతో పాటు కావలి రూరల్ ప్రాంతాల్లో రెండు నెలల్లో తీవ్ర గాలింపులు చేపట్టారు.

నాటుసారాతో కలిగే నష్టాలపై అవగాహన

జిల్లా అధికారుల ఆదేశాలతో గ్రామాల్లో నాటుసారా తాగడం వలన కలిగే నష్టాలను ఎక్సైజ్ అధికారులు గ్రామస్థులకు వివరి స్తున్నారు. వీటి తయారీ, అమ్మ కాలపై తీసుకునే చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పిస్తు న్నారు. అప్పటికీ నాటుసారా తయారీదా రుల్లో మార్పు రావడం లేదంటే కఠినమైన చర్యలు తీసుకుంటున్నారు.

అమ్మకాలపై చట్టపరమైన చర్యలు



సామాన్యుడి ప్రాణాలు హరించే నాటుసారా పూర్తిగా అరికట్టేందుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరంగా కృషి చేస్తున్నాం. మార్పురా కుండా అదేవిధంగా కొనసా గితే చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటున్నాం.

- శ్రీనివాసులు, కావలి ఎక్సైజ్ సీఐ

ఎల్లేటి కాలువ కబ్జా!

విడవలూరు మండలంలో సుమారు 300 ఎకరాలకు సాగునీరు అందించే ఎల్లేటి కాలువ కబ్జారాయుళ్ల కబంధ హస్తాల్లో చుక్కుకుంది. మన్మథ రావుపేట, చెలికల గ్రామాల మధ్యలో కిలోమీటరు పొడవున ఈ కాలువ విస్తరించి ఉంది. కాలువ ఆక్రమణకు గురై రూపురేఖలు కోల్పోతోం దని అధికారులకు రైతులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించు కున్న దాఖలాలు లేవు.

- గట్లను పూడ్చి రేకుల షెడ్ల నిర్మాణం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- నీటి పారుదల లేక రైతుల ఆందోళన



ఆక్రమణకు గురై కుంచించుకుపోయిన ఎల్లేటి కాలువ

విడవలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పొలాల నుంచి పులకనీరు, అలాగే వర్షం కురిసినప్పుడు నీరు పారేందుకు ఎల్లేటి కాలువ ఎంతగానో ఉపయోగపడుతోంది. సుమారు ఒక కిలోమీటరు పొడవు, 12 అడుగులు వెడల్పు ఉన్న ఎల్లేటి కాలువను అక్రమార్కులు చెరబట్టారు. కాలువ గట్ల మీద దర్జాగా రేకుల షెడ్లు నిర్మించి, తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఒకరిని చూసి మరొకరు అన్నట్టుగా ఈ కాలువను కబ్జా చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో పులకనీరు పారుదల కావడం లేదు. అదేవిధంగా ఇటీవల వచ్చిన వర్షాలకు నీరు పొలాల్లో నిలిచిపోయి పైరు పాచి పట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారులు పలుకుబడి ఉన్న వారు కావటంతో అధికారులు మౌనం వహిస్తున్నారు. ఎల్లేటి కాలువని రీ సర్వే చేసి ఆక్రమణలను తొలగించి న్యాయం చేయాలని రైతులు పలుధపాలు అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. కర్షకులకు న్యాయం చేస్తామని చెప్పిన యంత్రాంగం ఆ కాలువను ఆక్రమించుకున్న వారి పేర్లు వినగానే చల్లగా జారుకుంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కాలువనే నమ్ముకున్న రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలా!

ఎల్లేటి కాలువలో ఆక్రమణలు తొలగించి పూడిక తీయాలని మండలా ధికారులకు ఫిర్యాదు చేశాను. అయితే, ఎటువంటి ప్రయోజనం లేకపోవటంతో జిల్లా ఉన్నతాధికారులకు కూడా మెమొరాండం అందజేశాను. అప్పటికీ యంత్రాంగంలో చలనం రాకపోతే నిరాహార దీక్ష చేస్తా.

- శివకోటా రెడ్డి

చేపల వేట విషయమై
మత్స్యకారుల మధ్య వివాదం, ఉద్రిక్తత

- పోలీసుల చొరవతో సమస్య పరిష్కారం

కలువాయి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కలువాయి చెరువు సమీపంలోని సోమశిల, కండలేరు కాలువ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునేందుకు స్థానిక మత్స్యకారులను మాత్రమే అధికారులు అనుమతించారు. దీంతో బయటూరు నుంచి వచ్చిన మత్స్యకారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. చేపలు పట్టుకునే విషయంలో స్థానిక మత్స్యకారులకు, బయటూరు నుంచి వచ్చిన వారి మధ్య మంగళవారం వివాదం చెలరేగి, ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు చొరవ తీసుకుని సమస్యను మత్స్యశాఖ ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. సోమశిల, కండలేరు కాలువ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో గత ఏడాది మత్స్యకారులకు రూ.4కోట్లు విలువైన చేపలు దొరికాయి. దీంతో ఈ ఏడాది స్థానిక మత్స్యకారులతోపాటు బయటూరి వారికి కూడా దీనిపై దృష్టి పడింది. మంగళవారం ఉదయం రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునేందుకు పెద్దసంఖ్యలో స్థానిక మత్స్యకారులు వచ్చారు. ఓ వ్యాపారి ఆధ్వర్యంలో మండలంలోని రాజుపాళెంకి చెందిన కొందరు మత్స్యకారులు కూడా చేపలు పట్టుకునేందుకు వచ్చారు. తమకు జీవనాధారమైన రిజర్వాయర్‌లో బయట నుంచి వచ్చి చేపలు పట్టుకునేందుకు వీల్లేదని గిరిజన మత్స్యకారులు ఆందోళనకు దిగారు. దీంతో స్థానిక మత్స్యకారులు, బయటూరు నుంచి వచ్చిన వారి మధ్య వివాదంగా చెలరేగి, ఉద్రిక్తతకు దారి తీసింది. స్థానిక మత్స్యకారులకు టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు పాలా పిచ్చిరెడ్డి అండగా నిలిచారు. కలువాయి ఎస్ఐ సుమన్ రంగప్రవేశం చేసి సమస్యను మత్స్యశాఖ ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకుపోయారు. గత పదేళ్లుగా రిజర్వాయర్‌లో చేపలు పట్టుకుంటున్న స్థానిక మత్స్యకారులను మాత్రమే అనుమతించాలని వారి ఆదేశాల మేరకు పోలీసులు బయటూరి నుంచి వచ్చిన మత్స్యకారులను పంపించి వేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది.



రిజర్వాయర్ వద్ద బైఠాయించిన స్థానిక మత్స్యకారులు



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ సుమన్

చేపా..చేపా.. ఏమయ్యావ్!

కలువాయి చెరువు సమీపంలోని సోమశిల, కండలేరు కాలువ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోని మత్స్య సంపదపై అందరి అంచనాలు తలకిందులయ్యాయి. ఎంతో ఆశగా రిజర్వాయర్‌లో దిగిన మత్స్యకారులకు తీవ్రనిరాశ మిగిలింది. రూ. కోట్లు అటుంచి కనీసం రూ.10లక్షలకు కూడా చేపలు దొరకలేదని లబోదిబో మంటున్నారు. రిజర్వాయర్‌లోని చేపలపై ఇటీవల కలువాయిలో పెద్ద చర్చ నడిచింది. గత ఏడాది ఇదే రిజర్వాయర్‌లో రూ.4 కోట్లు మత్స్యసంపద దొరికింది. దీంతో ఈ ఏడాది కూడా ఇందులో అంతకాకున్నా... సగం దొరుకుతుందని అంచనా వేశారు. మంగళవారం వందల సంఖ్యలో మత్స్యకారులు, వ్యాన్లు, ఐస్‌బాక్స్‌లతో వ్యాపారులు, మరోపక్క చేపలు పట్టుకునేందుకు బయటూరి నుంచి ఇంకొందరు మత్స్యకారులు వచ్చారు. అక్కడ చేపలు లేకపోవడంతో మత్స్యకారులు దిగాలు పడిపోయారు.

ఒకేషనల్ తరగతుల పరిశీలన

సంగం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఒకేషనల్ ఎడ్యుకేషన్ తరగతులను మంగళవారం జిల్లా ఇన్‌చార్జి ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి, జీసీడీవో (గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) మమత పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అధ్యాపకులు సూచనలిచ్చారు. అనంతరం మాట్లాడుతూ సంగం ఉన్నత పాఠశాలలో హెల్త్ కేర్, ఎలక్ట్రానిక్స్ ట్రేడ్లలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 50 పాఠశాలల్లో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి చదువు పూర్తయి బయటకు వచ్చిన వెంటనే తన కాళ్లపై తాను నిలబడేందుకు ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బుజ్జయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జీసీడీవో మమత

ముత్తుకూరులో ఎన్జీటీ బృందం పర్యటన

- అనుమతుల్లేని బోర్ల పరిశీలన

ముత్తుకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్తుకూరు, పంటపాలెం పంచాయతీల్లో మంగళవారం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) బృందం సభ్యులు భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ దామోదర్ లక్ష్మీనారాయణ, స్పెషల్ కలెక్టర్ వెంకటరెడ్డిలు పర్యటించి మంచి నీటి బోర్లను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అక్రమంగా భూగర్భ జలాల తోడివేతపై ఢిల్లీలోని ఎన్‌జీటీ అధికారులకు చలివేంద్రకు చెందిన శ్రీరాములు వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేయడంతో దానిపై విచారణకు ఈ బృందం వచ్చింది. విచారణ అనంతరం జిల్లా కలెక్టర్‌తో కలిసి నివేదికను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై బెంచ్‌కి అందజేస్తామని తెలిపారు. ఫిర్యాదుదారుడు వెంకటేశ్వర్లు బృందం సభ్యులకు భూగర్భ జలాల తోడివేతకు సంబంధించిన స్థలాలను చూపించారు. ఆయా ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నీటిని పరిశ్రమలకు పంపిస్తున్నారన్నారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, భూగర్భ జలాలను కాపాడి స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



బోర్లను పరిశీలిస్తున్న ఎన్జీటీ బృందం సభ్యులు

రైలు పట్టాలపై వృద్ధుడి మృతదేహం

కోవూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పడుగు పాడు రైల్వేస్టేషన్ సమీపం లో రైలు పట్టాలపై ఓ గుర్తు తెలియని 65 నుంచి 70 ఏళ్ల వృద్ధుడి మృతదేహాన్ని మంగళవారం కావలి రైల్వే పోలీసులు గుర్తించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. మృతుడు ఆకుపచ్చ రంగు చొక్కా, నీలం తెల్ల రంగు గళ్ల లుంగీ, కాఫీ కలర్ మంకీ క్యాప్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి సమాచారం తెలిస్తే ఫోన్ 9848343638కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



వృద్ధుడి మృతదేహం

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని పెన్నా బ్రిడ్జ్ రైల్వే ట్రాక్ వద్ద మంగళవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై వైట్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్, బ్లూ,వైట్ చెక్స్ లుంగీ ఉన్నాయి. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్ఐ ఎన్ హరి చందన కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	117
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	212
స్కిన్‌లెస్	234
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7423
వెండి కిలో ధర	రూ. 92,000
వెండి ఒక గ్రాము	రూ.95.00

10న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సదస్సు

నెల్లూరు (వైద్యం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10వ తేదీన తోటపల్లి గూడూరు మండలం నరుకూరులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సదస్సు జరుగుతుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మంగళం పుల్లయ్య తెలిపారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి - ఉపాధి - వ్యవసాయ కార్మికుల స్థితిగతులు అన్న అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ హాజరవుతారని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కూలీలు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని, వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సదస్సు కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరాజు, జిల్లా సహాయ కార్యదర్శి పచ్చ మధు, రమణమ్మ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

కలువాయి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలపల్లి, వెంకటరెడ్డిపల్లి వద్ద సోమవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. పోలీసుల సమాచారం మేరకు, ఉయ్యాలపల్లి సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని చీలపోగు పవన్‌కుమార్ (25) అక్కడికక్కడే మృతి చెందారు. అనంతసాగరం మండలంల లింగంకుంటకి చెందిన పవన్‌కుమార్ ఉయ్యాలపల్లిలో పెళ్లి చేసుకున్నారు. తల్లిదండ్రులతో కలసి అత్తవారికి ఇంటికి వచ్చి దుర్మరణం చెందారు. వెంకటరెడ్డిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై రాపూరు మండలం ఆకలివలస గ్రామానికి చెందిన మలికా చెన్నకేశవులు(53) మోటారు సైకిల్ వెళ్తూ ఎదురుగా వస్తు న్న కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. 108లో వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెం దారు. చెన్నకేశవులు అనంతసాగరం మండలం ఉప్పలపాడు వద్ద కాపలాగా పని చేస్తున్నారు. ఆకలివలస నుంచి అక్కడికి వెళుతూ దుర్మరణం చెందారు.

సోమశిలలో 71.489 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 2,630 క్యూసెక్కులు ప్రవాహం నమోదైంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 71.489 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2050, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువలకు 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

10న మద్యం దుకాణాల్లోని వస్తువుల వేలం

నెల్లూరు (క్రైం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ నెల్లూరు డిపో పరిధిలో గతంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి తీసుకువచ్చిన వస్తువులను వేలం వేయనున్నట్లు ఆ డిపో మేనేజర్ ఆయేషా బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్వెర్టర్, బ్యాటరీలు 159, కాష్ కౌంటర్లు 146, బీర్లు పెట్టుకొనే ఫ్రిజ్‌లు 171, స్కానర్లు 324, క్యాష్ కౌంటింగ్ మిషన్లు 141 వంటి వస్తువులను ఈ నెల 10వ తేదీన వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు శుక్రవారం ఉదయం 10 గంటలకు వేదాయపాళెంలోని గాంధీనగర్ ఉన్న ఏపీ స్టేట్ వేర్‌హౌస్ గోదాముకు రావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9000015190, 98486277590, 9949351043 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

60 రోజులకు రావాల్సిన వెన్ను..

15 రోజులకే వస్తే..!?

● రాయలసీమ, తెలంగాణ మసూరిపై రైతుల్లో ఆందోళన

జలదంకి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఈ ఏ డాది జిల్లాలో రైతులు సాగు చేసిన కేఎన్ఎం 1638 (రాయలసీమ మసూరి), ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ మసూరి) రకం వరి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రతిఏడాది ఈ రెండు రకాలను సాగు చేసి లాభాలు పొందే అన్నదాతలు ఈ ఏడాది మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. ఈ రకం వరి సాగు జిల్లాలో 80శాతానికిపైగా ఉంది. నాట్లు వేసిన 60రోజుల తరువాత రావా ల్సిన వెన్ను పైరు వేసిన 15 రోజులకే తీస్తుండటంతో ఆందోళనకు గురవుతున్నారు.

● ప్రకృతి అనుకూలించకే...

ఈ రబీ సీజన్‌లో వరి రైతుకు ప్రకృతి అనుకూలించలేదు. ముందస్తుగా వర్షాలు కురిసి చెరువులు, ప్రాజెక్టులలో జలకళ సంతరించుకుంది. దీంతో అక్టోబరులోనే నార్లు పోశారు. రాయల సీమ, తెలంగాణ ప్రాంతాలలో నవంబరు ఆఖరున నార్లు పోసి డిసెంబరు 15న నాట్లు వేస్తారు. ముందస్తుగా నార్లు పోసి, సకాలంలో నాట్లు వేసినా ఆ తరువాత వరుస తుఫానులతో అధిక వర్షాలు కురవడంతోపాటు చల్లని వాతావరణంతో మబ్బులు కమ్మడంతో సూర్యరశ్మి లేక తక్కువ సమయంలోనే వరి పైరులో వెన్నులు తీశాయి. ఈ రకాలకు సూర్యరశ్మి అధికంగా ఉంటేనే పైరు ఏపుగా ఎదిగి నాటిన 60 రోజులకు వెన్నులు వరిగెనుపు నుండి బయటకు వస్తాయి.

● దిగుబడిపై తీవ్ర ప్రభావం

తక్కువ రోజుల్లో పొట్టి వెన్ను తీస్తే ఎకరానికి 20బస్తాల (75 కిలోలు) కూడా దిగుబడి వచ్చేది కష్టమేనని రైతులు అంటున్నారు. మామూలుగా అయితే ఎకరానికి 40 బస్తాలు అవలీలగా ఈ రకాలు దిగుబడి రావాలి. కానీ ఈ ఏడాది సగం పంట మాత్రమే వచ్చేలా ఉందని పైర్లను రైతులు చర్చించుకుంటున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా అందని పరిస్థితి తలెత్తింది. కౌలురైతు పరిస్థితి మరీ అగమ్యగోచరంగా మారింది.

● వాతావరణం అనుకూలించక కెఎన్ఎం, ఆర్ఎన్ఆర్ వరి రకాలు పంటలకు వెన్నులు తీస్తే ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. పైరులో నీరు పూర్తిగా తీసి ఎకరానికి 50కిలోల యూరియా చల్లి రెండురోజుల పాటు నీరు పెట్టరాదు. అనంతరం నీరు పెట్టి మరలా ఎకరానికి బస్తా యూరియా, అరబస్తా పొటాష్ పైరుపై చల్లితే కొత్తగా పిలకలు వచ్చి పైరు ఏపుగా పెరిగి దిగుబడులు వస్తాయన్నారు.



గన్నవరం సమీపంలో సాగు చేసిన కేపీటీగోల్డ్ 5854 రకం వరిపైరు

● ఎన్ఎల్ఆర్ 34449 రకం..

ఉమ్మడి జిల్లా వాతావరణానికి నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449) వరి రకం సాగు చేయవచ్చు. కెఎన్ఎం1638, ఆర్ఎన్ఆర్15048 ర కాలు మనకు సరిపోవు. వాతావరణ పరిస్థితి బట్టి రకాలు ఎంచుకోవాలి. ప్రతి ఏడాది సమావేశాలు పెట్టి ఈ విషయం చెప్పినా కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్‌లకు ధర ఉందని సాగు చేస్తారు.

- వినీత, వ్యవసాయ శాస్త్రవేత్త

15 వరకు బీమా గడువు

బిట్రగుంట : రైతుల కోసం ప్రవేశపెట్టిన పంట బీమా పథ కంను ఈ నెల 15వ తేదీ వరకు పొడిగిం చినట్లు మండల వ్యవసాయ అధికారి విజ యలక్ష్మీ తెలిపారు. మంగళవారం జక్కేప ల్లిగూడూరులో నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతులు, వీఆర్వో, వీఏఏలు ఉన్నారు.



తిరునాళ్లలో పాల్గొన్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ప్రశాంతి, కావ్య కృష్ణారెడ్డి, టీడీపీ నేత బీద రవిచంద్ర తదితరులు

చంద్రబాబుకు పోలేరమ్మ ఆశీస్సులు అందాలి : మంత్రి ఆనం

అల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును అన్ని వేళలా ఆశీర్వాదించాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అల్లూరు పోలేరమ్మను మొక్కుకున్నారు. మంగళవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డిలతో కలిసి పోలేరమ్మ తిరునాళ్లలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతు సీఎం చేసే పలు బృహత్తర కార్యక్రమాలకు మరింత దీవెలను అందించి చల్లగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, పెన్నార్ డెల్టా కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, కావలి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అలేఖ్య, జనసేన కావలి ఇన్‌చార్జి సుధాకర్, శ్రీనివాసులురెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు

● విన్నర్స్, రన్నర్స్‌గా పీజీ కళాశాల, జేబీ జట్లు

కావలి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీజీ కాలేజీలో జరిగిన కావలి జోన్ అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విన్నర్స్‌గా వీఎస్‌యూ పీజీ కళాశాల.. రన్నర్స్‌గా జేబీ కళాశాల జట్లు నిలిచాయి. ఫైనల్స్ పోటీలను ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా కావలి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్దు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ముగింపు కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరారెడ్డి పాల్గొని విజేతలకు షీల్డ్‌లతో పాటు బహుమతులు అందజేశారు. టోర్నీ అబ్జర్వర్‌గా ప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శిగా పీడీ మణికంఠ వ్యవహరించారు. పీడీలు శ్రీనివాసులు, తిరుపాలు, రమణయ్య, భాస్కర్‌రావు, కొండలు, తిరుమల పోటీల నిర్వహణకు సహకారం అందించారు.



పీజీ కళాశాల జట్టుకు విన్నర్స్ కప్పు అందిస్తున్న ప్రిన్సిపాల్ వీరారెడ్డి

పిల్లల సంరక్షణ పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో ఐసీడీఎస్ సీడీపీవో అరుణ, డాక్టర్ సింధు తదితరులు

ఉలవపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కిశోర బాలికల వికాసం, వ్యక్తిగత పరిర క్షణపై ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అధికారులు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఎంఈవో పీవీ రమణయ్య, చాకిచర్ల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సింధు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. బాలికలకు నాణ్యమైన విద్య, మానవ అక్రమ రవాణ, ఆత్మరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, పోక్సో యాక్ట్, బాల్య వివాహాలు, బ్యాడ్ టచ్.. గుడ్ టచ్, లింగ వివక్షత, ఉపాధి నైపుణ్యాలను వివరించారు. అనంతరం సీడీపీవో అరుణ ఉచిత హెల్ప్‌లైన్ నెంబర్లు, పిల్లల సంరక్షణ పుస్తకాలను ఆవిష్కరించి వాటిని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజి అధ్యాపకురాలు సుభాషిణి, సాధన సచివాలయ మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌కు మూడువేల రిజిస్ట్రేషన్లు

సంగం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకంలో ఇప్పటి వరకు ఎస్సీ ఎస్టీ వర్గాలవారు మూడువేల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని బుచ్చి సబ్‌డివిజన్ ఎలక్ట్రికల్ ఏడీ సతీష్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంలో ఉచితంగా సోలార్ పలకలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీనివల్ల బిల్లు చెల్లించకుండానే మిగులు విద్యుత్‌ను స్థానిక గ్రిడ్‌కు సరఫరా చేసినందుకు వీలుంటుందన్నారు. ఆరు నెలలకొకసారి మనీ పే బ్యాక్ వారి ఖాతాకు జమ చేస్తామన్నారు. ఇందుకు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆధార్, మొబైల్, కరెంటు సర్వీస్ రసీదు ఇస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఈ మన్మథరావు, సబ్ ఇంజనీర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏడీ సతీష్

శిక్షణ తరగతులు తప్పనిసరి



తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు

ఉదయగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థులకు వంద రోజుల శిక్షణ తరగతులు తప్పనిసరిగా నిర్వహించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణ తరగతులను పరిశీలించి సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉదయం, సాయంత్రం సమయాల్లో నిర్వహించే శిక్షణ తరగతులను హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థుల సందేహాలను నివృతి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలకేశవులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ హ్యాండ్‌బాల్ పోటీల విజేతకు అభినందన

కందుకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం పుడిమాక బీచ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పురుషుల బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలో కళాశాల విద్యార్థి నాగబాబు తృతీయ బహుమతి సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పీడీ కరుణకుమార్‌లు నాగబాబును అభినందించారు.



నాగబాబును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పీడీ తదితరులు

పోలీసు కుటుంబాలకు ఉచిత వైద్యశిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆస్టర్ రమేష్ సంఘమిత్ర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. కందుకూరు సబ్ డివిజన్‌లోని వివిధ స్టేషన్లలో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు. వీరిని వైద్యులు పరీక్షించి మందులు అందజేశారు.

అవసరాల మేరకే యూరియా సరఫరా

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా చేస్తున్నమని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలిపారు. మంగళవారం మండలంలోని మినగల్లు, రేవూరు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండలంలో సహకార సంఘాల ద్వారా 92 టన్నులు, రైతు సేవాకేంద్రాల ద్వారా 620 టన్నుల యూరియా ఇప్పటి వరకు సరఫరా చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏలు శేషగిరిరావు, శ్రీనివాసులు, ఏవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమించి లేఅవుట్!

● కావలి పట్టణంలో ఓ వైసీపీ నేత నిర్వాహకం

● స్థానిక ప్రజల సమాచారంతో మున్సిపల్ అధికారుల స్థలం పరిశీలన

కావలి, జనవరి7 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ స్థలాల ఆక్రమణ అంటే జనాలకు భయం లేకుండా పోయింది. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపిస్తే అక్కడ ఆక్రమించి ప్లాట్లు వేసుకున్నా ఇప్పటివరకు అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. అదే ధైర్యమో లేక ఆయన వెనుక బలమైన నేత ఎవరైనా ఉన్నారో ఏమో తెలియదు కాని ఓ వైసీపీ నాయకుడు పట్టణంలోని మద్దూరుపాడు పాత ఆర్అండ్‌బీ రోడ్డు, నేషనల్ హైవేకు మధ్యలోని కూడలిలో ఉన్న రూ.2కోట్ల విలువ చేసే 200అంకణాల స్థలాన్ని ఆక్రమించాడు. అందులో ప్లాట్లు వేసాడు. ఇది గత ప్రభుత్వంలో ఎప్పుడో జరిగింది కాదండోయ్.. ఇటీవల మూడు రోజుల కిందటే జరిగిన బాగోతం. ప్రస్తుతం వీటిని అమ్మకాలకు పెట్టారు. ఎంతో విలువైన ఆ ప్రభుత్వ స్థలంలో ఎవరు ప్లాట్లు వేశారో తెలియక స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ శ్రావణ్‌కుమార్, పట్టణ ప్రణాళికాధికారి వివేక్‌లు తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని ఆశ్చర్యపోయారు. వెంటనే అందులో వేసిన రాళ్లు తొలగింపజేశారు. ఈ విషయంపై ఆరా తీయగా మూడు రోజుల కిందట వైసీపీ నాయకుడు ఒకరు ఆక్రమించినట్లు తెలిసింది. ఈ స్థలం ఆక్రమించిన ఆ నేత గతంలో కూడా ప్రభుత్వ స్థలం ఆక్రమించి తమ లేఅవుట్‌లో కలుపుకుని విక్రయించినా అప్పట్లో అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. అదే ధైర్యంతో ఇపుడు చేయడంతో ఇపుడు అది అందరి కంటపడి బహిర్గతం అయ్యింది.



రాళ్లు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

పెట్రోల్‌బంకు నిర్మాణం.. మేం ఒప్పుకోం

● నిర్మాణ పనులను అడ్డుకున్న నేతలు, స్థానికులు

కావలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చేపడుతున్న ఐవోసీ పెట్రోల్ బంకు నిర్మాణ పనులను మంగళవారం స్థానిక ప్రజలు, టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలోని 20సెంట్లను భూమిని కేటాయిస్తూ గత ప్రభుత్వం స్థలం కేటాయించింది. అక్కడ నిర్మాణం చేపట్టేందుకు సోమవారం స్థలం చుట్టూ పరదాలు కట్టి లోపల నిర్మాణం కోసం పునాదులు కొంతమేర తీశారు. కాంక్రీట్ పనులు చేపట్టేందుకు అవసరమైన ఇసుక, కంకర, సిమెంట్‌ను తెచ్చి ఉంచారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు టీడీపీ నేతలు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల అనుమతుల మేరకే తాము పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు టీడీపీ నేతలతో కలిసి అక్కడ కట్టి ఉన్న పరదాలను పీకేస్తుండటంతో వారే మిగతా పరదాలను తీసుకున్నారు. ఇక్కడ పెట్రోల్ బంకు నిర్మాణం చేపడితే ప్రజలు ఇబ్బందులు పడతారని తెలిపారు. అనంతరం అందరూ కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడారు. పెట్రోల్ ఇక్కడ వద్దని ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని లేకుంటే మీరే పనులు ఆపాలని కోరుతూ తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఇక్కడ పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, పెట్రోలు బంకు నిర్మాణం చేపడితే వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతుంటారని చెప్పారు. అలాగే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంకు వచ్చే వాహనాలు కూడా పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం ఉండదని కనుక పెట్రోల్ బంకును మరొక ప్రాంతానికి తరలించాలని చెప్పారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తహసీల్దారు వారికి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, దావులూరి దేవకుమార్, పోతుగంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన పరదాలను తొలగిస్తున్న ప్రజలు, టీడీపీ నేతలు

భూముల వివరాలు సరిచేయండి



లింగసముద్రం: చినపవనిలో రైతు నుంచి అర్జీ తీసుకుంటున్న తహసీల్దారు సీతామహాలక్ష్మి

లింగసముద్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన రెవెన్యూ సదస్సులు ముగిశాయి. మంగళవారం చినపవని, పెదపవని గ్రామాల్లో చేపట్టిన సదస్సుల్లో తహసీల్దారు ఎస్.సీతామహాలక్ష్మి పాల్గొని రైతుల నుంచి అర్జీలు తీసుకున్నారు. చినపవనిలో 14, పెదపవనిలో 16అర్జీలు వచ్చినట్టు తహసీల్దారు తెలిపారు. వీటిలో మ్యుటేషన్, ఫోర్జింగ్ కోసం వచ్చాయని, త్వరలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణయ్య, వీఆర్‌ఓలు ఎంవీకే కిషోర్, మస్తాన్ వలి, బ్రహ్మయ్య, అమానుల్లా, జకీరా, సర్వేయర్లు సాయిరాం, వెంకటేశ్వరరెడ్డి, సోంపల్లి మనోహర్, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

● ఉదయగిరి: రీసర్వేలో చోటు చేసుకొన్న భూ తప్పిదాలను సరి చేయాలని బిజ్జంపల్లి, బండగానిపల్లి, కృష్ణారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లా డుతూ రీసర్వే పుణ్యమా అంటూ పలువురు రైతుల భూ విస్తీర్ణం తగ్గిపోవడం, వేరే రైతుల పేర్లు నమోదు కావడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. అలాగే భూ ములకు ఆన్‌లైన్‌లో 1బీ, అడంగల్ రా కపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. అధికా రులు స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. స్పందించిన తహసీల్దారు పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీ ఐటీయూ నాయకులు గడ్డం నాగేశ్వర రావు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

● సీతారామపురం: రెవెన్యూసద స్సుల వల్ల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ కృష్ణారెడ్డి అన్నారు. పండ్రంగిలో తహసీల్దార్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలని రైతులు 26అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి ఎస్ నాగేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయర్ సంగీత, వీఆర్వో మనోహర్, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయగిరి : తహసీల్దారుకు వినతిపత్రం అందచేస్తున్న రైతులు

ఉపాధి చట్టంపై అవగాహన

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జనవరి7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీవో ఆజంఖాన్ మాట్లాడుతూ కమిషనర్ సూచించిన మేరకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నిర్ధేశించిన చట్టం మేరకు అర్హులైన ప్రతిఒక్కరికి పని కల్పించి, పెరిగిన రూ.300ల వేతనం అందేలా చూడాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ కీలకబాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంధమహోత్సవం

ఉదయగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షబ్బీర్ కాలనీ సమీపంలో ఉన్న ఖాజా గరీబున్ నవాజ్ అస్థాన వారి గంధమహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఫకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల నడుమ గంధాన్ని ఊరేగింపుగా అస్థానకు చేర్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు పంచిపెట్టారు. ముస్లింలు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి

ఉదయగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వింజమూరు ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగే ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయా లని ఉదయగిరి, దుత్తలూరు మండలాల టీడీపీ కన్వీనర్లు సీహెచ్ బయ్యన్న, వెంకటరత్నం మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల పాల్గొంటా రన్నారు.

● సీతారామపురం: వింజమూరులో జరిగే ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని మండల టీడీపీ నాయకులు కోరారు. పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, సింగాల నాగేశ్వరరావు, ఎదమ ప్రవీణ్, మహాలక్ష్మయ్య, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

● కలిగిరి: వింజమూరు ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు.

ఆశా వర్కర్లతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

వింజమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ.బ్రిజిత ఆశా వర్కర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లు గ్రామంలో కేన్సర్, ఇతర వ్యాధులను గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలని కోరారు. అలాగే విధులు సక్రమంగా నిర్వహించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డాక్టర్ మురళీధర్, సృజన, సిబ్బంది పాల్గొన్నారు.

● సంగం: స్థానిక వైద్యశాలలో ఆశాడేను పురస్కరించుకుని మంగళవారం వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి వైద్య ఆరోగ్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భగా జరిగిన నెలరోజులు నిర్వహించిన వైద్య సర్వేలు, టీకా కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం చేపట్టాల్సి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రెండవ వైద్యాధికారి అశోక్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

10న ఆత్మకూరులో జాబ్‌మేళా

ఆత్మకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 10న జాబ్‌మేళా నిర్వహిం చ నున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 91827 99405, 79016 20305 నెంబర్లను సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

ఆదర్శ మహిళా ఉద్యోగులకు అభినందన



మహిళా కండక్టర్లను అభినందిస్తున్న డీఎం శ్రీనివాసరావు

కావలి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబరులో కండర్లకు నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను 106శాతం సాధించిన ఆర్టీసీ ఆదర్శ మహిళా ఉద్యోగులు రమాదేవి, సునీత, సుభాషిణిలను నగదు, బహుమతులతో మంగళవారం డిపో మేనేజర్ శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కల్పన, సూపరింటెండెంట్ రామకృష్ణ, సెక్యూరిటీ అధికారి రావు, రవిప్రకాష్ ఉన్నారు.

అండగా ఉంటాం

బిట్రగుంట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన కుటుంబసభ్యులకు అండగా ఉండేందుకే పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ ప్రారంభిస్తున్నట్లు సంఘం కార్యదర్శి గోవిందరాజులు తెలిపారు. బోగోలులో మంగళవారం నూతన అసోసియేషన్ సభ్యులతో అధ్యక్షులు పసుపులేటి చెంచయ్య సమావేశమయ్యారు. ఈ నెల 9వ తేదీ నూతన కార్యాలాయాన్ని ప్రారంభిస్తా మన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసులు. కోశాధికారి ఎస్.శ్రీనివాసులు, కార్యనిర్వాహణ కార్యదర్శి దేవరాజన్, సభ్యులు ప్రసాద్, ఎలమందయ్య, రమణయ్య, సుబ్రమణ్యం తదిత రులు ఉన్నారు.

ఉపాధి పనులపై శిక్షణ

లింగసముద్రం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులపై శాఖ అధికారులు, సిబ్బందికి మంగళవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ కమీషనర్ కృష్ణతేజ వీడియో కాన్ఫరెన్స్ శిక్షణ ఇచ్చారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణలో లింగస ముద్రం, వలేటివారిపాలెం ఎం పీడీఓలు శ్రీనివాసులు, నరేంద్రదేవ్‌లు ఏపీ ఓ షేక్ సమీర్‌బాషాలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

ఉలవపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అలగాయపాలెం రైతుసేవా కేంద్రం-3లో మంగళవారం కందుకూరు కృషి విజ్ఞాన్ కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో అధికారులు వేరుశనగ రైతులకు సమగ్ర పోషకాలు, సస్యరక్షణ యా జమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు మాట్లాడారు. వేరుశనగ పూత దశలో ఎకరాకి 200కిలోల జిప్సం ఎరువును భూమిలో కలిపితే అధిక దిగుబడి వస్తుందన్నారు. అనంతరం రైతులతో కలిసి పంటను పరిశీలించి కాండం కుళ్లు తెగులు, మచ్చ తెగులు గమనించారు. నివారణకు వాడాల్సిన పురుగు మందులు సూచించారు. రైతులకు జిప్సం బస్తాలు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ జ్యోతి, మాయాంక్, డాక్టర్ శ్రీరంగ వీఏఏ వంశీ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్లీడరుగా నారాయణరావు

నెల్లూరు, జనవరి 7 (ఆం ధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా చుండూరి శ్రీహరి నారాయణ రావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పరంగా ఉన్న సివిల్ కేసులను నారాయణరావు వాదించనున్నారు. మూడేళ్ల పాటు ఈ పదవిలో ఆయన కొనసాగనున్నారు. నెల్లూరు నగరానికి చెందిన నారాయణరావు ప్రస్తుతం టీడీపీ స్టేట్ లీగల్ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉన్నారు. ముప్పై ఏళ్లగా ఆయన టీడీపీలో పనిచేస్తున్నారు. గత ప్రభు త్వం లో టీడీపీ నేతలపై పెట్టిన కేసులను న్యాయపరం గా ఎదుర్కోవడంలో కీలకంగా వ్యవహరించారు. 1994లో న్యాయవాద వృత్తిని చేపట్టిన ఆయన నెల్లూరు, గూడూరు, కోవూరు న్యాయస్థానాల్లో అనేక కేసులు వాదించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని గ్రామాల అభివృద్ధిలో టీడీపీ నాయకు లు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని ఎమ్మె ల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. మంగళవారం ఆమె పోతిరెడ్డిపాళెం సాలు చింతల కూడలిలో సిమెంటు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజక వర్గంలో సంక్రాంతిలోగా రూ.12.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. ఈ పనులను నాయకులు, కార్యకర్తలు పర్యవేక్షించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని చెప్పారు. జిల్లాలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు దొరకుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, జడ్పీటీసీ కవరగిరి శ్రీలత, సర్పంచు నలుబోలు శ్రీవాణి, టీడీపీ, జనసేన నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, ఇంతా మల్లారెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి, ఏ.శ్రీప్రసాద్‌రెడ్డి, జీ.అశోక్‌కుమార్, చప్పిడి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

● మధ్యాహ్న భోజనం భేష్

మధ్యాహ్న భోజనం బాగుందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కితాబిచ్చారు. సాలుచింతల నుంచి నెల్లూరుకు వెళ్తూ మార్గమధ్యంలోని కోవూరులో జేబీఆర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచికరంగా ఉందని ప్రశంసించారు.

గిరిజనుల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పైనాపురం పంచాయతీ చిన్నసంఘం గిరిజన కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. తన మనుమళ్లతో కలసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో గిరిజనులు ఆధార్ కార్డులు లేక రేషన్‌కార్డు, ఇతర సంక్షేమ పథకాలు పొందలేకపోయారన్నారు. అయినా అప్పటి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పట్టించుకో లేదన్నారు. పైనాపురం పంచాయతీ గిరిజన కాలనీలో 70 మందికి జననధ్రువీకరణ పత్రాలు, 80 మందికి ఆధార్ కార్డులు నమోదు, 17 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించామన్నారు. గిరిజన బిడ్డలు తప్ప నిసరిగా బడికి వెళ్లడంపైన అందరూ శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం స్థానిక నాయకుడు ఈదూరు రామ్మోహన్ రెడ్డితో కలిసి అన్నాక్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. కృష్ణపట్నం వేణుగోపాల్‌స్వామి, మనుమసిద్ధేశ్వర స్వామి దేవస్థానాల నిధులతో ఏర్పాటు చేయనున్న కళ్యాణ మండపం కోసం తహసీల్దారు కార్యాలయం వెనుక స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు బొమ్మి సురేంద్ర, చిన్న బాబిరెడ్డి, మల్లికార్జున యాదవ్, కాంతా రావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు సమాజ ప్రగతిని అడ్డుకుంటాయి

● వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు, తదితరులు

వెంకటాచలం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు కేవలం వ్యక్తుల జీవితాలను ప్రభావితం చేయడమే కాకుండా సమాజ ప్రగతిని కూడా అడ్డుకుంటాయని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా కిషోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భేటీ బచావో భేటీ పడావో గోడ పత్రికను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ప్రొఫెసర్ సుజా ఎస్ నాయర్, పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారి బీ సురేష్, అనురాధ, సుశీలదేవి తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : కిషోరి వికాసం పోస్టరు ఆవిష్కరిస్తున్న అధికారులు

పొదలకూరు,(ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళల ఉజ్వల్ భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని వెంకటాచలం ఐసీడీఎస్‌ఐ సీడీపీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్‌ఎంలకు కిశోరి వికాసం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సురేఖ, ఎంఈవోలు రేణుక, శోభనాద్రి, ఎంపీడీవో నరసింహారావు, వెలుగు ఏపీఎం చిన్నయ్య, డాక్టర్ కావ్య తదితరులు మాట్లాడారు. అనంతరం కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్‌ఐ సూపర్‌వైజర్లు పద్మజ, జ్యోతిలక్ష్మి, నారాయణమ్మ, హెడ్ కానిస్టేబుల్ అక్తర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో రాష్ట్రం దివాలా

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జగన్ నేతృత్వంలోని గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని దివాలా తీయించారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. రూ.2.52 కోట్లతో జరుగుతున్న అయ్యప్పగుడి - కేవీఆర్ కూడలి రహదారి మరమ్మతు పనులను మంగళ వారం ఆయన పరిశీలించారు. జగన్ ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంద న్నారు. అభివృద్ధి కార్యక్రమాలు కేవలం టెంకాయలు కొట్టడానికి పరిమితమయ్యాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆర్థిక లోటు ఉన్న ప్పటికీ ప్రజల అవసరాలను గుర్తించి రహదారులు, రోడ్ల నిర్మాణ, ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు జెన్ని రమణయ్య, మురహరి, సాయిసునీల్, పురుషోత్తం, బాలకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులపై అధికారులకు సూచనలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీని రద్దు చేయాలి

నెల్లూరు (వైద్యం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మొత్తాన్ని కలెక్టర్ రద్దు చేయాలని రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యుడు, న్యాయవాది మక్కెన అంకయ్య చౌదరి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పురపాలక శాఖ మంత్రి నారాయణను రెడ్‌క్రాస్ వివా దంలోకి లాగటం అమానుషమన్నారు. 2023 ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారానికి రెడ్‌క్రాస్ వలంటీర్లను వినియోగించారని విమర్శించారు. ఎమ్మెల్సీగా గెలిచిన చంద్రశేఖర్‌రెడ్డి రెడ్‌క్రాస్ అంటే తానే అన్నట్లు వ్యవహరించారని ఆరోపించారు. రెడ్‌క్రాస్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కాలుష్య రహిత భోగి మంటలు వేయాలి



సంప్రదాయక భోగి మంటలపై అవగాహన కల్పిస్తున్న బ్లాక్‌బోర్డు మిత్రమండలి సభ్యులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భోగి మంటలను సంప్రదాయ పద్ధతిలో కాలుష్య రహితంగా వేయాలని బ్లాక్‌బోర్డు మిత్ర మండలి అధ్యక్షుడు నరసాపురం ప్రసాద్ కోరారు. వెంకటేశ్వరపురంలోని నగర పాలక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం సంప్రదాయక భోగి మంటలపై అవగాహన కల్పించారు. కాలుష్యరహిత వస్తువులైన ఆవుపేడతో చేసిన పిడకలు, చీపుర్లు, చెక్కలు, తాటాకులు వంటివి భోగి మంటకు ఉపయోగించాలని సూచించారు. టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు, చెప్పులు వంటివి మంటల్లో వేస్తే కాలుష్యం పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు రవికుమార్, సుభాష్, రామ్ ప్రసాద్, గౌస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతోనే విజయాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తహసీల్దారు చంద్రశేఖర్

విడవలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలు ఆత్మస్థైర్యంతో ఉంటేనే విజయాలు సాధిస్తారని తహసీల్దారు చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం.. బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది కార్యక్ర మంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహసీల్దారు చంద్రశేఖర్ జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణి, సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఈఎండీపీ శిక్షణ

నెల్లూరు(విద్య), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లోని సృజనాత్మ కతను వెలికితీసి నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఈఎండీపీ)లో భాగంగా ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు మంగళవారం మొదలయ్యాయి. జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన 38 పాఠశాలల ఉపాధ్యాయులకు నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో తర్ఫీదునిచ్చారు. 9వతరగతి విద్యా ర్థులకు తరగతుల నిర్వహణ, ప్రాజెక్టుల తయారీపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సుధీర్‌బాబు, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఎండీపీ జోనల్ మేనేజర్ నీలిమ, మాస్టర్ ట్రైనీలు రాధా, హెప్సి తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ సభ్యత్వ నమోదు

పొదలకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) మండల శాఖ నాయకులు మంగళవారం మండలంలోని పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీటీఏ కార్యదర్శి ఊట్ల రఘు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.చక్రపాణి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.మహేంద్రకుమార్, అధ్యక్షుడు వి.హజరత్తయ్య, ప్రధాన కార్యదర్శి కె.శీనయ్య పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌రెడ్డికి మైండ్‌పోయింది

● రెడ్‌క్రాస్‌కు, నారాయణకు సంబంధమేమిటి..? ● ఆక్వాకల్చర్ బోర్డు కో వైస్ ఛైర్మన్ ఆనం



విలేకరులతో మాట్లాడుతున్న ఆనం వెంకటరమణారెడ్డి

నెల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మతిపోయిందని, ఏదేదో మాట్లాడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆక్వాకల్చర్ బోర్డు కో వైస్ ఛైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం రాత్రి నెల్లూరులోని తన నివాసంలో ఆనం విలేకరులతో మాట్లాడారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తూ మంత్రి నారాయణపై విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సిందిగా మంత్రి నారాయణ గన్‌పెట్టి బెదిరించినట్లుగా చంద్రశేఖర్ రెడ్డి కట్టుకథలు అల్లడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు నారాయణకు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ రాజీనామాకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. 2019 వరకూ చంద్రశేఖర్‌రెడ్డి అసలు రెడ్‌క్రాస్‌లో మెంబరే కాదని, ఆయనకు అక్కడ ఏం చేస్తారో కూడా తెలియదని విమర్శించారు. ఛైర్మన్‌గా ఎన్నికైన నాటి నుంచి చంద్రశేఖర్‌రెడ్డి ఒక్క చుక్క రక్తాన్ని అయినా దానం చేశారా అని ఆనం ప్రశ్నించారు. రెడ్‌క్రాస్‌ను సర్వనాశనం చేసిన వ్యక్తి చంద్రశేఖర్‌రెడ్డి అని మండిపడ్డారు. రెడ్‌క్రాస్ ఎన్నికల్లో మనోహర్‌రెడ్డి ప్యానెల్‌కు వెన్నుపోటు పొడిచి ఛైర్మన్ అయ్యారని ఆరోపిం చారు. నెల్లూరు సిటీలో పెద్ద నా యకు డిగా చంద్రశేఖర్‌రెడ్డి ఫీల్ అవుతున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక ఎన్నడూ చంద్రశేఖరెడ్డి విద్యాసంస్థల జోలికి నారాయణ వెళ్లలేదని, కానీ వైసీపీ ప్రభుత్వంలో నారాయణను ఎలా ఇబ్బంది పెట్టారో ప్రజలం దరికీ తెలుసునన్నారు. ప్రజలే చంద్రశేఖరెడ్డికి బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ ప్లీడరుగా నారాయణరావు



నెల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా చుండూరి శ్రీహరి నారాయణ రావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పరంగా ఉన్న సివిల్ కేసులను నారాయణరావు వాదించనున్నారు. మూడేళ్ల పాటు ఈ పదవిలో ఆయన కొనసాగనున్నారు. నెల్లూరు నగరానికి చెందిన నారాయణరావు ప్రస్తుతం టీడీపీ స్టేట్ లీగల్ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉన్నారు. ముప్పై ఏళ్లగా ఆయన టీడీపీలో పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం లో టీడీపీ నేతలపై పెట్టిన కేసులను న్యాయపరంగా ఎదుర్కోవడంలో కీలకంగా వ్యవహరించారు. 1994లో న్యాయవాద వృత్తిని చేపట్టిన ఆయన నెల్లూరు, గూడూరు, కోవూరు న్యాయస్థానాల్లో అనేక కేసులు వాదించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసులో నిందితుడిని సంతపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... గుర్తు తెలియని వ్యక్తి నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పగటిపూట భిక్షాటన చేసుకుంటూ రాత్రి వేళల్లో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీరు కార్యాలయం పక్క నున్న చెట్ల కింద నిద్రించేవాడు. ఆయన ఓ మహిళతో రెండేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. గతనెల 29వ తేదీ తెల్లవారు జామున ఆయన దారుణ హత్య కు గుర య్యాడు. సహజీవనం చేస్తున్న మహిళ అదృశ్యమైంది. స్థానిక వీఆర్వో సందానీ బాషాతో సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు, ఎస్‌ఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారం గా నిందితుడు చెన్నై తాంబరానికి చెందిన హరీష్ అలియాస్ చంటిగా గుర్తించి మంగళ వారం అదుపు లోకి తీసుకున్నారు. హరీష్ 15 ఏళ్ల కిందట నెల్లూరు కు వచ్చి భిక్షాటన, రైళ్లలో గుట్కాలు అమ్ముకుంటూ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో జీవించసాగాడు. అదే ప్రాంతంలో భిక్షాటన చేసే మహిళతో సహజీవ నం చేసేవాడు. రెండేళ్ల కిందట ఆ మహిళ హరీష్ నుంచి విడిపోయి హత్యకు గురైన వ్యక్తి వద్దకు వెళ్లింది. ఈ విషయంలో హరీష్‌కు, హత్యకు గురైన గుర్తుతెలియని వ్యక్తికి మధ్య గొడవలు జరిగాయి. హరీష్ అతనిపై కక్ష పెంచుకొని ఎలాగైనా చంపాలని నిర్ణ యించుకున్నాడు. ఈ క్రమంలోనే గత నెల 29వ తే దీ గుర్తుతెలియని వ్యక్తి ఆదమరిచి నిద్రిస్తుండగా హరీష్ కర్రతో విచక్షణ రహితంగా దాడి చేసి హత్య చేశాడు. ఈ వివరాలను నిందితుడు పోలీసుల విచారణలో వెల్లడించాడు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

నెల్లూరు(క్రైం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని మహిళ తెంపుకెళ్లిన ఘటన నగరంలోని రెవెన్యూ కాలనీలో మంగళవారం జరిగింది. రెవెన్యూ కాలనీ శిల్పాస్కూల్ సమీపంలో ప్రభావతమ్మ కుటుంబం నివసిస్తోంది. భర్త ప్రతిరోజూ ఉదయం పనులకు వెళ్లడంతో ఆమె ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. మంగళవారం బుర్ఖా ధరించిన ఓ మహిళ పిట్టగోడ దూకి ప్రభావతమ్మ ఇంట్లోకి ప్రవేశించింది. వృద్ధురాలి మెడలోని మూడున్నర సవర్ల బంగారు సరుడును తెంపుకెళ్లింది. బాధితురాలు తేరుకుని కేకలేసేటప్పటికి అక్కడి నుంచి పరారైంది. దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

నెల్లూరు(విద్య), జనవరి 7 (ఆంధ్రజ్యో తి): యువత క్రీడల్లో రాణిస్తూ ఒత్తిడిని అధిగమించాలని ఎన్‌వైకే జిల్లా అధికారి మహేంద్రరెడ్డి సూచించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం ప్రజాసత్తా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఖోఖో, షార్ట్‌పుట్, వంద మీటర్ల పరుగు, వాలీబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసత్తా అధ్యక్షుడు శోభన్‌బాబు, హిమతేజ, మురళీమోహన్, ఖాజాబీ, పీఈటీలు పాల్గొన్నారు.

ఏపీ హంస క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(వైద్యం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం (హంస) నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత మంగళవారం ఆమె చాంబర్‌లో ఆవిష్కరించారు. జీజీహెచ్ పీపీ యూనిట్‌లోనూ ఏవో డాక్టర్ వెంకటేశ్వర్లు ఈ కొత్త క్యాలెండర్‌ను విడుదల చేశారు. హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకరరావు, ప్రధాన కార్యదర్శి కమల్ కిరణ్, కోశాధికారి మజారుల్లా, ఉపాధ్యక్షులు సహన, మురళీకృష్ణ, నాగరాజమ్మ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేతకు సతీవియోగం

రాపూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత నువ్వుల శివరామకృష్ణ సతీమణి రామలక్ష్మి అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం కన్నుమూశారు. దివంగత ఎమ్మెల్యే నువ్వుల వెంకటరత్నంనాయుడు సమీప బంధువైన నువ్వుల రామలక్ష్మి అంత్యక్రియలు బుధవారం ఉదయం స్వగ్రామమైన కండలేరు డ్యామ్‌లో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

పొదలకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3తేదీలలో జరగనున్న సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి చంద్రా రాజగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల కమిటీ విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మహాసభలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కె.పెంచలనరసయ్య, మండల నాయకులు బి.మనోహర్, రంగయ్య, జి.మణి, యానాదిరెడ్డి, పాండు, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

పొదలకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా పూలబొకేలు, శాలువాలకు ఖర్చు చేసే డబ్బులుతో పేదలకు సహాయం చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక టీడీపీ నాయకులు మండలంలోని అంకుపల్లి గిరిజన కాలనీలో గిరిజనులకు మంగళవారం దుప్పట్లు, విద్యార్థులకు పలకలు, పెన్నులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, పిచ్చినాయుడు, కలిచేటి శ్రీనివాసులురెడ్డి, రాఘవులు, ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పోలంరెడ్డి అభినందన



ప్రభుత్వ సీఎస్ విజయానంద్‌ను సన్మానిస్తున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

కోవూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్‌ను ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి సన్మానించారు. మంగళవారం ఆయనను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు తమ కార్పొరేషన్ చేపట్టనున్న కార్యక్రమాలను దినేష్‌రెడ్డి వివరించారు. జీవ సంబంధ, ఎలక్ట్రానిక్ వ్యర్థాల వినియోగం పై రూపొందించిన ప్రణాళికలను వివరించి రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సహకారం అందించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సానుకూలంగా స్పందించినట్లు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు.

నేడు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పొదలకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నరసింహారావు తెలిపారు. ఈ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడుతో కలసి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని, అర్జీలు సమర్పించే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డుతో రావాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగు లకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేఈసీ విద్యాసాగర్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ఎంతోకాలంగా బకాయిల కోసం ఎదురు చేస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి కల్లం శ్రీనివాసులు, సయ్యద్ మున్వర్ సుల్తానా, వారణాసి శేషగిరిరావు పాల్గొ న్నారు.

మార్చి 31లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

బుచ్చిరెడ్డిపాళె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని జగనన్న లేఔట్లలో అర్ధాంతరంగా ఆగిన ఇళ్ల నిర్మాణాలు మార్చి 31లోగా పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ ఎంవీ మోహన్‌రావు ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ముందుగా పంచేడు, మినగల్లు, బుచ్చి నగర పంచాయతీలోని పలు లేఔట్లలో ఆగిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సమావేశంలో హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లురెడ్డి, ఏఈ చిన్న పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.


వవ్వేరు బ్యాంకు చైర్‌పర్సన్‌గా దొడ్ల విజయలక్ష్మి?




బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డి పాళెంలోని వవ్వేరు కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంకు త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్‌గా దొడ్ల విజయలక్ష్మిని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. గత టీడీపీ ప్రభుత్వంలో విజయలక్ష్మి బుచ్చి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలుగా ప్రజలకు సేవలందించారు. సభ్యులుగా కాళయకాగొల్లుకు చెందిన మద్దెసాని మాల్యాద్రి, చెల్లాయపాళెంకు చెందిన కోవూరు పద్మ పేర్లను ప్రతిపాదించారు.

సంక్రాంతికి ప్రత్యేక సర్వీసులు

రాపూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి బెంగుళూరు నుంచి రాపూరుకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఈనెల 10, 11 తేదీల్లో ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశామని ఆర్టీసీ డీఎం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసుల్లో సాధారణ చార్జీలు మాత్రమే వసూలు చేస్తారని, అదనపు చార్జీలు ఉండవని ఆయన తెలిపారు.



తిరుపతి జిల్లాకు మరో పారిశ్రామిక మణిహారం




క్రిస్ సిటీ

తిరుపతి జిల్లాకు మణిమకుటంగా మారనున్న క్రిస్ సిటీకి నేడు ప్రధాని నరేంద్రమోదీ విశాఖపట్టణం నుంచీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. ఇప్పటికే శ్రీసిటీ సెజ్ ద్వారా అంతర్జాతీయ కంపెనీల స్థాపనతో ప్రపంచవ్యాప్త గుర్తింపు అందుకున్న తిరుపతి జిల్లా తాజాగా క్రిస్ సిటీ ప్రాజెక్టుతో మరింత ఉన్నత స్థానానికి చేరనుంది. కృష్ణపట్నం పోర్టు, చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లను ఆధారంగా చేసుకుని క్రిస్ సిటీ ఏర్పాటవుతోంది. చిల్లకూరు, కోట మండలాల్లో మొత్తం పది వేల ఎకరాల్లో మూడు దశల్లో ఏర్పాటయ్యే క్రిస్ సిటీ రూ.37,500 కోట్ల పెట్టుబడులు ఆకర్షిస్తుందని, తద్వారా 4.67 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంచనా వేస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- నేడు విశాఖ నుంచీ శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- రూ.2139 కోట్లతో 2500 ఎకరాల్లో మౌళిక వసతుల కల్పన
- రూ.37,500 కోట్ల పెట్టుబడులు... 4.67 లక్షల ఉద్యోగాలు వస్తాయన్న అంచనా

తిరుపతి-నెల్లూరు జిల్లాల సరిహద్దుల్లోని కృష్ణపట్నం పోర్టు ఏర్పాటుతో ఆ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇప్పటికే వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో ఏపీఐఐసీ పారిశ్రామిక వాడల్లో ఇప్పటికే పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు.



మరోవైపు కృష్ణపట్నం పోర్టును ఆధారం చేసుకుని కేంద్ర ప్రభుత్వం చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టు ప్రారంభించింది. దీనికింద కృష్ణపట్నం ఇండస్ట్రియల్ నోడ్ కింద క్రిస్ సిటీని ప్రతిపాదించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం వ్యయం భరించేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది.

10,834 ఎకరాల్లో మూడు దశలుగా..

కేంద్రం రూపొందించిన క్రిస్ సిటీ మొత్తం 10,834 ఎకరాలలో మూడు దశలుగా ఏర్పాటు కానుంది. తొలి దశ పనులకు నేడు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. మొదటి దశలో జిల్లాలోని చిల్లకూరు, కోట మండలాల్లో 2500 ఎకరాలు సేకరించి అందులో క్రిస్ సిటీ ఏర్పాటుకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించనున్నారు. ఈ తొలిదశ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 2139.43 కోట్లు. మౌళిక సదుపాయాలు కల్పిస్తే ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్ అండ్ అప్పారెల్స్, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్స్, ఇంజనీరింగ్ అండ్ ఎంఎస్ఎంఈ, ఇతర బిల్డింగ్ మెటీరియల్స్ వంటి సెక్టర్ల నుంచీ పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులు వస్తాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఈ రంగాల నుంచీ మొత్తంగా రూ. 37,500 కోట్ల పెట్టుబడులు వస్తాయని, వాటి ద్వారా 4,67,500 మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నాయి. క్రిస్ సిటీ ప్రాజెక్టు 2027 ఫిబ్రవరికి పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.


తొలి దశ భూసేకరణ పూర్తి

జిల్లాలోని గూడూరు నియోజకవర్గం చిల్లకూరు, కోట మండలాల పరిధిలో ప్రతిపాదిత క్రిస్ సిటీ ఏర్పాటు కానుంది. చిల్లకూరు మండలం తమ్మినపట్నం, తూర్పు కనుపూరు, మోమిడి, వెల్లపాలెం, బల్లవోలు గ్రామాలు, అలాగే కోట మండలం కొత్తపట్నం, సిద్ధవరం, కర్లపూడి గ్రామాల నుంచీ భూములు సేకరిస్తున్నారు. చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో 1494.15 ఎకరాలు, తూర్పు కనుపూరులో 400.17 ఎకరాలు, మోమిడిలో 282.61 ఎకరాలు, వెల్లపాలెంలో 1715.71 ఎకరాలు, బల్లవోలులో 1639.09 ఎకరాలు, కోట మండలం కొత్తపట్నంలో 3620.79 ఎకరాలు, సిద్ధవరంలో 745.60 ఎకరాలు, కర్లపూడిలో 936.38 ఎకరాలు చొప్పున మొత్తం 10,834.50 ఎకరాలు సేకరించాల్సి వుండగా ప్రస్తుతానికి తొలిదశ కోసం గుర్తించిన 2500 ఎకరాల్లో ఇప్పటి వరకూ 2,238 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన 262 ఎకరాలు పెండింగులో వుంది.

మొదలైన పనులు : క్రిస్ సిటీలో మౌళిక సదుపాయాల కల్పన కింద రోడ్ నెట్‌వర్క్, వాటర్ సప్లై నెట్‌వర్క్, రీ యూజ్ వాటర్ నెట్‌వర్క్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 132-33 కేవీ సబ్ స్టేషన్, 33-11 కేవీ ఇంటర్నల్ సబ్ స్టేషన్లు వంటివి నిర్మించాల్సి ఉంది. వీటిలో రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాల పనులు ఇప్పటికే మొదలయ్యాయి. నేడు ప్రధాని శంకుస్థాపన చేయనుండడంతో ఇక నుంచీ పనులు జోరందుకోనున్నాయి.



చిల్లకూరు మండలం తమ్మినపట్నం వద్ద జరుగుతున్న బ్రిడ్జి పనులు



భయం వద్దు

- జాగ్రత్త పడితే చాలు
- కలకలం రేపుతున్న చైనా కొత్త వైరస్

'కరోనా వైరస్ లాంటిదేదో బెంగళూరు, చెన్నై వరకు వచ్చేసింది. మళ్లీ లాక్‌డౌన్‌లు పడతాయేమో? అందరం ఇంటికీ పరిమితమవ్వాల్సిందేనేమో? వంటి ఊహాగానాలు ప్రజల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఏ నలుగురూ జతకూడినా రోజుకొక్కసారైనా కొత్త వైరస్ గురించి మాట్లాడుకుంటున్నారు. కరోనా తాలూకా అనుభవాలు, జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్నారు. కాగా, నిన్న మొన్నటి వరకు ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్, ఇప్పుడు హెచ్ఎంపీవీ (హ్యూమన్ మెటాన్యూమోవైరస్) కలకలం రేపుతోంది. చైనా నుంచి దిగుమతైన హెచ్ఎంపీవీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. అలాంటి భయాందోళనలు అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. అందుకే జిల్లా వైద్య యంత్రాంగం కూడా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకుండా కొత్త వైరస్‌పై లైట్ తీసుకుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

లక్షణాలిలా.. : కరోనా వచ్చినప్పుడు ఎలాంటి లక్షణాలను గుర్తించామో ఇప్పుడు కూడా అలాంటివే ఉంటాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి. జలుబు, ముక్కుదిబ్బడ, గొంతు నొప్పి, దగ్గు, సాధారణ జ్వరం వంటి లక్షణాలు హెచ్ఎంపీవీలోనూ కనిపిస్తాయి. తుమ్ములు, దగ్గు ద్వారా ఈ వైరస్ ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది.

ఆందోళన వద్దు.. అలాగని నిర్లక్ష్యంగా ఉండొద్దు



హెచ్ఎంపీవీ వలన ఇప్పటికప్పుడు ఆందోళన చెందాల్సిన పనిలేదు. అలాగని నిర్లక్ష్యంగా ఉండొద్దు. కొత్త వైరస్ కాబట్టి ఇమ్యునిటీ ఉంటుంది. వ్యాధినిరోధక శక్తి లేనివాళ్లకు శ్వాసకోస సంబంధిత ఇన్‌ఫెక్షన్ ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. ఆ సమయంలో ఓ కంటకనిపెడుతూ ఉండాలి. అనుమానం వస్తే వైద్యుల్ని సంప్రదించాలి. శ్వాసకోస వ్యాధి కేసుల అడ్మిషన్లు పెరుగుతుంటే హెచ్ఎంపీవీ సోకిందేమోనని పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సాధారణ స్థితిలోనే కేసులు ఉన్నాయి. జలుబు, దగ్గు ఉన్నా.. జన సమూహాల్లోకి వెళుతున్నా.. ముక్కు, నోటికి కలిపి మాస్కులు పెట్టుకోవడం చాలా ఉత్తమం. సాధారణ వ్యాధి లక్షణాలు కనబడితే ఇంట్లో విశ్రాంతి తీసుకోవాలి.

- డాక్టర్ సుబ్బారావు, పల్మనాలజిస్ట్, రుయాస్పత్రి

12న సీఎం చంద్రబాబు తిరుపతి రాక

13, 14 స్వగ్రామంలో బస.. 15న తిరుగు ప్రయాణం

తిరుపతి,జనవరి7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 12వ తేదీన తిరుపతి రానున్నారు. తిరుపతిలోని తాజ్ హోటల్‌లో జరిగే గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు. అనంతరం స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లె చేరుకుంటారు. ఈనెల 13, 14 తేదీల్లో అక్కడే గడిపి.. 15న అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు. ఏటా సంక్రాంతి సందర్భంగా నారా, నందమూరి కుటుంబీకులు నారావారిపల్లెలో రెండు మూడు రోజుల పాటు బస చేసి పండుగ జరుపుకొని వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా చంద్రబాబు సైతం క్రమం తప్పకుండా కొన్నేళ్లుగా కుటుంబంతో సహా స్వగ్రామానికి వచ్చి పండుగ ఇక్కడే జరుపుకుంటున్నారు.అయితే ఇటీవల సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మృతి చెందిన నేపథ్యంలో ఏడాది పాటు పండుగలేవీ జరుపుకునే పరిస్థితి లేదు. ఈ ఏడాది పండుగ జరుపుకోకపోయినా ఆ రోజుల్లో స్వగ్రామంలోనే గడుపుతారని అనధికారిక సమాచారం. కాగా, సీఎం చంద్రబాబు పర్యటన ఇప్పటివరకూ అధికారికంగా ఖరారు కాలేదు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న చంద్రబాబు

ఆరోగ్యం.. ఆదాయం.. ఆనందం

కుప్పం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): 'హెల్దీ, వెల్దీ, హ్యాపీ అనే మూడు సూత్రాలతో కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం నా లక్ష్యం. ఇందుకోసం రూ.550 కోట్లతో వివిధ పరిశ్రమలకు, పథకాలకు ఈరోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నాను. ఈ పనులన్నీ మీకోసమే. సద్వినియోగం చేసుకోవడం మీ చేతుల్లోనే ఉంది.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. కుప్పం పర్యటనలో రెండో రోజైన మంగళవారం ముఖ్యమంత్రి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడమే కాకుండా ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు పంపిణీ చేశారు. కుప్పంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఈ కార్యక్రమాల అనంతరం లబ్ధిదారులు, ప్రజలతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

- **కుప్పంలో జనాభా, నైపుణ్యం రెండూ పెరగాలి**

కుప్పంలో జనాభా రానురాను తగ్గిపోతోంది. జనాభా పెరగడంతోపాటు, యువతలో నైపుణ్యం కూడా పెంచాలి. ప్రపంచ స్థాయి ఎడ్యుకేషన్ అందాలి. మనం నెక్స్ట్ లెవెల్‌కు వెళ్లాలి. సంపద సృష్టించి, తలసరి ఆదాయం పెంచాలి. అందుకు అవసరమైన ప్రణాళికలు నేను తయారు చేయించాను. మీరు వాటిని ఉపయోగించుకుని సర్వతోముఖాభివృద్ధి చెందాలి.

- **నాలుగు అంశాలే ప్రధానం**

ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే నాలుగు అంశాలే ప్రధానం. పేదరిక నిర్మూలన, ఆర్థిక స్థితిగతుల ఉన్నతి, ఉద్యోగ ఉపాధి కల్పన, జనాభా నిర్వహణ (పాపులేషన్ మేనేజ్‌మెంట్). ఈ నాలుగు అంశాలే ప్రధానంగా స్వర్ణ కుప్పం విజన్ డాక్యుమెంట్ 2029 తయారైంది. యువతలో, మహిళలల్లో నైపుణ్యాలను శిక్షణ ద్వారా పెంచి, ఉద్యోగ, ఉపాధి కల్పన చేయడం ద్వారా ఈ నాలుగు అంశాలను సాధించే అవకాశం ఉంది. ఆ దిశగానే నేటి అభివృద్ధి కార్యక్రమాలు రూపొందాయి. కడా బాగా పనిచేస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పారిశ్రామికవేత్తలను, వివిధ రకాల ఏజెన్సీలను కుప్పం పిలిపించి ఒప్పందాలు చేయించారు. ఈ కార్యక్రమాలన్నీ పూర్తయితే ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్త తయారవుతారు. మరికొందరికి ఉద్యోగాలు ఇవ్వగలిగే స్థాయికి ఎదుగుతారు.

- **విమానాల మరమ్మతు స్టేషన్**

కుప్పంలో త్వరలోనే విమానాశ్రయం వస్తోంది. ఇక్కడి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల రవాణాకోసం కార్గోతోపాటు డొమెస్టిక్ విమానాశ్రయం కూడా రూపుదాలుస్తుంది. మీరు కూడా విమానం ఎక్కి ఎక్కడికైనా వెళ్లొచ్చు. ఈ విమానాశ్రయం దగ్గరే విమానాలను రిపేరు చేసే వర్క్ స్టేషన్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటాను. విమానాశ్రయం, వర్క్ స్టేషన్ వల్ల ప్రత్యక్షంగానే కాక, పరోక్షంగా వేల మందికి ఉపాధి దొరుకుతుంది.

- **మూడు నెలల తర్వాత మళ్లీ వస్తా**

ఇప్పుడు ఏయే అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానో, అవన్నీ ఈ మూడు నెలల్లో ఒక స్టేజీకి వస్తాయి. నేను మూడు నెలల తర్వాత మళ్లీ వస్తాను. అప్పుడు అభివృద్ధిని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకు వెళ్తాను.

మెడికల్ ఇంటెగ్రిటీ

ప్రజారోగ్యం చాలా ముఖ్యం. ఆరోగ్యంగా ఉంటేనే ఏపని అయినా సాధించగలం. అందుకోసం మెడికల్ ఇంటెగ్రిటీ తీసుకొస్తాను టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎండీ ఇక్కడికి వచ్చారు. ఆయనతో ఇప్పుడే చర్చలు జరిపాను. కోలార్ జిల్లాలో మెడికల్ ఇంటెగ్రిటీని వారు తీసుకొచ్చారు. అదే తరహాలో టాటా మెడికల్ సైన్సెస్ ద్వారా చిత్తూరు జిల్లాలో మెడికల్ ఇంటెగ్రిటీ తీసుకొస్తాను. అంటే అన్ని ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులను అనుసంధానం చేస్తాను. తద్వారా ప్రతి ఒక్కరి మెడికల్ రికార్డు ఆన్‌లైన్ ద్వారా నమోదవుతుంది. ఎవరికి ఏ వైద్య సాయం అందాలన్నా క్షణంలో పొందే అవకాశం ఉంటుంది. ఈ మెడికల్ ఇంటెగ్రిటీని మొదట కుప్పంనుంచే ప్రారంభిస్తాను. తర్వాత చిత్తూరు జిల్లాకు, ఆపైన రాష్ట్రానికి విస్తరిస్తాను. కుప్పం నాకు ఒక ప్రయోగశాల. ఏ ప్రతిష్ఠాత్మక పథకమైనా ఇక్కడినుంచే ప్రారంభించి.. రాష్ట్రమంతటా విస్తరించడం ఒక విధానంగా అమలు చేస్తున్నాను. దీనితోపాటు స్వచ్ఛ సమాజం కూడా తీసుకొస్తే కుప్పం ప్రజల ఆయుష్షు సాధారణం కంటే మరో 20-30 ఏళ్ల పెరుగుతుంది.





ఆలయ శుద్ధి

తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు ఉండటంతో.. మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించారు. టీటీడీ చైర్మన్, బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వెంటాడి.. గంజాయి వాహనం పట్టివేత

కోట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న వాహనాన్ని పోలీస్, టాస్క్‌ఫోర్స్ బృందాలు సినీఫక్కీలో వెంటాడి పట్టుకున్నాయి. వైజాగ్ నుంచి గంజాయితో ఓ కారు కోట మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నట్లు సమాచారం అందింది. వెంటనే పోలీసులు, టాస్క్‌ఫోర్సు బృందాలు వెంబడించడంతో గంజాయి వాహనం కడివేడు మీదుగా వెళ్లిపోయింది. కోట మండలంలోని విద్యానగర్, చంద్రశేఖర్‌పురం, చిట్టేడు, కేశవరం, కొండుగుంట మార్గాల్లో వెళుతున్న వాహనాన్ని పోలీస్, టాస్క్‌ఫోర్స్ బృందాలు వెంటాడాయి. విద్యానగర్‌లోని పెట్రోల్ బంకు వద్ద స్థానిక యువకులు ఎక్స్‌కవేటర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో గంజాయి వాహనం ఆగిపోయింది. పోలీస్, టాస్క్‌ఫోర్స్ బలగాలు ఆ వాహనాన్ని చుట్టుముట్టి అందులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. ఆ కారులో సుమారు 80కిలోల గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలిసింది. వివరాలు తెలియాల్సి ఉంది.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 26 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.20 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 54,180

తలనీలాలు సమర్పించినవారు: 17,689







నరశింగరావుపేట ప్రాంతంలోని రైల్వేస్టేషన్ గోడ అనుకుని శ్యామ్ నాటిన మొక్కలు

మొక్కవోని లక్ష్యం

● గ్రీన్ మ్యాన్ గూడూరు శ్యామ్‌కుమార్‌రెడ్డి



సొంత ట్యాంకర్‌తో మొక్కలకు నీటిని పడుతున్న శ్యామ్

మొక్కల పెంపకం ద్వారా సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నారో వ్యక్తి. గూడూరులోని షాదీమంజిల్ సమీపాన నివాసముంటున్న మద్దాలి శ్యామ్‌కుమార్‌రెడ్డి ప్రైవేటు కళాశాలలో సంస్కృత అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. వృత్తితోపాటు నిరంతరం తన ప్రవృత్తి కూడా నిర్వర్తిస్తున్నారీయన. 22 ఏళ్లుగా పట్టణంలోని వీధుల్లో, కూడళ్లలో, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద మొక్కలను నాటుతున్నారు. పచ్చదనం పరిరక్షణ కోసం మోడుమారుతున్న మొక్కలకు ప్రాణం పోస్తున్నారు. తానే ట్రక్కుఆటో కొని వాటర్‌క్యాన్‌లో నీటిని నింపుకుని తీసుకువెళ్లి మొక్కలకు పోసి కన్నబిడ్డల్లా సాకుతున్నారు. ఈయన నాటిన మొక్కలు ఇప్పుడు చెట్లుగా పెరిగి నీడనిస్తున్నాయి. తుపాన్లలో నేల కొరిగిన వాటినీ నిలబెట్టి ప్రాణం పోస్తూ కాలుష్యరహిత సమాజానికి తనవంతు కృషిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి మొక్కలు పెంచడం ఎంతో ఇష్టమని చెబుతారు శ్యామ్‌కుమార్‌రెడ్డి. పొగడ, కానుగ, వేప, మర్రి, నేరేడు, బాదం, దేవగన్నేరి, టెంపుల్, మారేడు తదితర ఎన్నో రకాల మొక్కలను నాటారు. మొదట్లో వెయ్యికి పైగా మొక్కలను స్వయంగా నాటి రోజూ నీరు పోసేవారు. ఈయనలోని సామాజిక దృక్పథాన్ని గమనించిన కొందరు దాతలు ముందుకొచ్చారు. మొక్కల కోసం ట్రీగార్డులను అందజేయడం ప్రారంభించారు. ఈయన ప్రయత్నానికి చేదోడుగా నిలిచారు. ఇప్పటికే 5వేలకు పైగా మొక్కలను నాటి సంరక్షిస్తున్నట్లు శ్యామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలో పచ్చదనం వ్యాప్తికి శ్యామ్‌కుమార్‌రెడ్డి చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు.

- గూడూరు, (ఆంధ్రజ్యోతి)





తుపానులో కూలిపోయిన టెంపుల్‌ట్రీ చెట్టును నిలబెట్టి.. ప్రాణం పోశారు ఇలా..

చెడిపోయిన మాంసం

● కుళ్లిన కూరగాయలు
● ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడుల్లో విస్తుపోయే నిజాలు
● 14 హోటళ్లలో తనిఖీలు చేసి నోటీసులు జారీ
● చర్యలు తీసుకుంటామన్న రాష్ట్ర డైరెక్టర్ పూర్ణచంద్రరావు



తిరుచానూరు వద్ద ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లలో మంగళవారం రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో 10 బృందాలుగా ఏకకాలంలో దాడులు చేశాయి. నాణ్యతా ప్రమాణాలను అధికారులు పరిశీలించారు. తిరుచానూరు వద్దనున్న ఓ హోటల్‌లో కుళ్లిపోయి, గడ్డకట్టిన్న మాంసాన్ని డీప్ ఫ్రిడ్జిలో ఉంచడం బయటపడింది. అనుమతుల్లేని ఎసెన్స్‌లు వాడుతున్నట్లు చర్చించారు. చెడిపోయిన టమోటాలతో చట్నీ, సాస్‌ల తయారీ.. చికెన్ కబాబ్ తదితరాలను మళ్లీ వేడి చేసి కస్టమర్లకు వడ్డించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇళ్లలో ఇలాగే చేస్తారా అంటూ సిబ్బందిని నిలదీశారు. రేణిగుంట రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో మూడు నెలల క్రితం కాలపరిమితి దాటిన ఊరగాయల బాటిళ్లను, చెడిపోయిన నూడుల్స్, పుట్టగొడుగులు, చికెన్ కబాబ్‌ను గుర్తించారు. ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఓ రెస్టారెంటులోని కొన్ని ఆహార పదార్థాల్లో రంగు, రుచి కోసం వాడుతున్న కలర్లు డూప్లికేట్‌వి గుర్తించారు. నగరంలోని మరో హోటల్‌లో కాలపరిమితి ముగిసిన రొటీలు, బ్రెడ్లు, పుట్టగొడుగులు బయటపడ్డాయి. ఇంకో హోటల్‌లో గోబీ మంజూరి, జాంగ్రీ చెడిపోయి వుందని తనిఖీ అధికారులు చెప్పారు. ఇంకో హోటల్‌లో పురుగులు పట్టిన అలసందలు, నువ్వులు, కొన్ని ఆహార పదార్థాలను సీజ్ చేశారు. మరో హోటల్‌లో ఫ్రిడ్జి పనిచేయక ఆహార పదార్థాలు, పెరుగు చెడిపోయిందని, వీటిని కస్టమర్లకు ఎలా వడ్డిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగులు కలిపిన కందిపప్పు చెడిపోయిన జీడిపప్పు, పుట్టగొడుగులు ఉన్నట్లు ఇంకో హోటల్ తనిఖీల్లో బయటపడింది. ఇంకో హోటల్‌లో తిరుపతి ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి తనిఖీ చేయగా.. వండి నిల్వ వుంచిన ఆహార పదార్థాలు ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం కొన్ని హోటళ్లు, తోపుడు బండ్లపై టిఫిన్లు, వివిధ రకాల తినుబండారాలను తనిఖీ చేశారు. ఆయా తనిఖీల్లో కర్నూలు ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాలరావు, తిరుపతి నుంచి మద్దిలేటి, జగదీష్, సుమన్, చిత్తూరు నుంచి శ్రీనివాస్, వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాబ్‌కు పంపి చర్యలు తీసుకుంటాం

మా తనిఖీల్లో బయటపడిన ఆహార పదార్థాలు, ముడిసరుకులను సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నాం. ప్రస్తుతం హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం. ఎవ్వరినీ వదలిపెట్టే ప్రసక్తేలేదు. ల్యాబ్‌కు పంపిన బిర్యానీ, వివిధ ముడిపదార్థాలు, సరకుల్లో లోపాలుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయి. అన్ని హోటళ్లలో అపరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేస్తుండటాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నాం.

- పూర్ణచంద్రరావు, ఫుడ్ సేఫ్టీ రాష్ట్ర డైరెక్టర్

రెవెన్యూ సదస్సులకు 213 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన 27 రెవెన్యూ సదస్సులకు 213 అర్జీలు అందినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. వీటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించామని పేర్కొన్నారు.

వినియోగదారులపై ఆర్థిక భారం తగదు



ప్రజాభిప్రాయ సేకరణలో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలపైనే ఏపీఈఆర్‌సీ ఆర్థికభారాన్ని మోపడానికి దిగడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఎం నేత కందారపు మురళి పేర్కొన్నారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన వర్చువల్‌గా తన వాదన వినిపించారు. ప్రజాభిప్రాయ సేకరణలు చేపట్టినా చివరకు ప్రభుత్వాల ఆదేశాలను పరోక్షంగా అమలు చేస్తోందని ఆరోపించారు. చార్జీలు పెంచడానికి ఇచ్చిన అనుమతులే ఇందుకు నిదర్శనమన్నారు. సెకీ విద్యుత్ ఒప్పందం, స్మార్ట్ మీటర్లు అమర్చడం వంటివి నియంత్రణ మండళ్ల నిస్సహాయతకు సాక్ష్యాలని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ32 వేల కోట్ల భారాన్ని మోపితే, కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లో రూ.16 వేల కోట్లు భారాన్ని వినియోగదారులపై మోపడం అన్యాయమని తెలియజేశారు. ప్రభుత్వాలు 25 ఏళ్లకు ఒప్పందాలు చేసుకోవడం, ఒక యూనిట్ విద్యుత్ కూడా కొనుగోలు చేయకుండా లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఉత్పత్తిదారులకు చెల్లించడాన్ని రద్దు చేయాలన్నారు. సెకీ, ఆదానీల ఒప్పందాలను రద్దు చేసి తిరిగి టెండర్లను ఆహ్వానించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్ర నాయుడు, ఈఈ వి.చంద్రశేఖర్ రావు, వాసవీలత, ఎస్ఏవో శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి పక్షుల పండుగ

● కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి ● విజయవంతానికి అధికారులు కృషి చేయాలని ఆదేశం



సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానాన్ని ఎమ్మెల్యేతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

తడ/సూళ్లూరుపేట/దొరవారిసత్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కేంద్రంగా ఈ 18వ తేది నుంచి మూడు రోజులపాటు పక్షుల పండుగ నిర్వహించాలని నిర్ణయించామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలసి మంగళవారం ఆయన దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రాన్ని, సూళ్లూరుపేట మండలం అటకానితిప్ప వద్ద పులికాట్ సరస్సు, వన్యప్రాణి విభాగం విజ్ఞానకేంద్రం, జూనియర్ కళాశాల మైదానం, తడ మండలం భీములవారిపాళెం పడవల రేవును పరిశీలించారు. పండుగ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ప్రజా ప్రతినిధుల సూచనలను స్వీకరించారు. సూళ్లూరుపేటలోని ఓ కల్యాణ మండపంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోను.. పర్యటనల్లోనూ ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించలేదని, ఇప్పుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. 18వ తేది శనివారం శోభాయాత్రతో ఈ పండుగ ప్రారంభమవుతుందని నేలపట్టు, అటకానితిప్పల్లో పక్షులను వీక్షించడం, భీములవారిపాళెంలో పడవ షికారు, సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాల మైదానంలో ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహిస్తామని వివరించారు శ్రీసిటీలోనూ కార్యక్రమాలు నిర్వహించేలా నిర్ణయించామన్నారు. పర్యాటకుల కోసం పడవలను సిద్ధం చేసినట్లు చెప్పారు. పర్యాటకులకు ఏర్పాట్లు చేయడానికి తన అధ్యక్షతన 16 మంది అధికారులతో పండుగ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పక్షుల పండుగ నేపథ్యంలో నేలపట్టుకు గూడూరు సబ్ కలెక్టర్, అటకానితిప్పకు డీఆర్‌డీఏ పీడీ, భీములవారిపాళెం మత్స్యశాఖ ఏడీ, శ్రీసిటీకి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, సూళ్లూరుపేట కార్యక్రమాలకు డ్వామా పీడీలను ఇన్‌చార్జులుగా నియమించామన్నారు. జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించిన ఆయన మీడియాతోనూ మాట్లాడారు. మన ప్రాంతంలో జరిగే పక్షుల పండుగను అందరి సహకారంతో విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, డీఆర్వో నరసింహులు, సూళ్లూరుపేట వన్యప్రాణి సంరక్షణశాఖ డీఎఫ్ఏవో హారిక, టూరిజం జిల్లా అధికారి జనార్దన్‌రెడ్డి, డీవీఎం శ్రీనివాసరావు, పర్యాటకశాఖ ఆర్డీ రమణప్రసాద్, మత్స్యశాఖ ఏడీ నాగరాజు, ఆయా మండలాల అధికారులు, నేతలు పాల్గొన్నారు.

2,770 సీసీ కెమెరాల నిఘాలో వైకుంఠద్వార దర్శనాలు

● 12 వేల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు
● 9న ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు



తిరుపతిలో క్యూల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఈవో గౌతమి, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల, జనవరి7(ఆంధ్రజ్యోతి): వైకుంఠద్వార దర్శనాలకు వచ్చే భక్తుల భద్రతకు టీటీడీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇందుకోసం 2,770 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. తిరుపతిలో సర్వదర్శన టోకెన్లు జారీ చేసే కేంద్రాల్లోనూ 50 కెమెరాలను ఏర్పాటు చేశారు. టీటీడీ ఈవో శ్యామలరావు మంగళవారం మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు.

వైకుంఠద్వారదర్శనం టోకెన్లు ఇచ్చే కేంద్రాలు

తిరుపతిలో: ఇందిరామైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్, బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్‌పల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జడ్పీ ఉన్నత పాఠశాల. ఈ కేంద్రాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఈ కేంద్రాల్ల వద్ద గూగుల్ లొకేషన్ మ్యాప్స్ ఏర్పాటు చేశారు.

తిరుమలలో : కమ్యూనిటీ హాల్‌లోని 4 కౌంటర్లలో.

వసతి ఏర్పాట్లు: పదిరోజుల పాటు తిరుమలలో వసతి ఆన్‌లైన్ బుకింగ్ రద్దు. సామాన్య భక్తులకు మాత్రం సీఆర్వోలో గదులు కేటాయిస్తారు. 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు తిరుమలలోని ఎంబీసీ, ఏఆర్పీ, టీబీసీ, కాటేజీ డోనార్ స్కీం అలాట్మెంట్ కౌంటర్లు మూసివేస్తారు.

పార్కింగ్: తిరుమలలో 12 వేల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఎంబీసీ, ఔటర్ రింగ్‌రోడ్డు, రాంభగీచా, పరకామణి భవనం, అర్చక నిలయంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. టికెట్లపై ఎంట్రీ పాయింట్, అలైటింగ్ పాయింట్, పార్కింగ్, పికప్ పాయింట్ల వివరాలు ముద్రిస్తారు.

ఇతర నిర్ణయాలు

● దర్శన టోకెన్లు కలిగిన భక్తులకే క్యూలైన్‌లోకి అనుమతి. ● జనవరి 9వ తేదీకి అదేరోజుకు ఇచ్చే ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు. ● శ్రీవారిమెట్టు మార్గంలో టోకెన్ జారీ కౌంటర్లు జనవరి 19వ తేదీ వరకు మూసివేత. ● వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సులు స్వీకరించరు. ● భక్తులకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా మంచినీరు, అన్నప్రసాదాల పంపిణీ. అన్నప్రసాద కేంద్రాలతో పాటు ఫుడ్‌కౌంటర్ల ద్వారా సాంబారన్నం, పాలు, టీ, స్నాక్స్ మంచి నీరు పంపిణీ. ● 3 వేల మంది యువ శ్రీవారిసేవకులు, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు. ● 2,082 మంది సిబ్బందితో పారిశుధ్యం. అదనంగా 150 కేటాయింపు.

చెట్టును ఢీకొన్న కారు

ఒకరి మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు

చిట్టమూరు, జనవరి7(ఆంధ్రజ్యోతి): కారు చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చిట్టమూరు మండల పరిధిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. నాయుడుపేటకు చెందిన నలుగురు వాకాడు నుంచి నాయుడుపేటకు కారులో వెళ్తుండగా చిట్టమూరు రొయ్యల కాలువ సమీపంలోని చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాయుడుపేటకు చెందిన భరత్‌కుమార్ గాంధీ (60) అక్కడిక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చిట్టమూరు పోలీసులు ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ప్రమాద స్థలంలో ఒకరు మృతిచెందగా.. గాయపడిన మరో ముగ్గురు

చెరకు కూలీలపై దూసుకెళ్లిన కంటైనర్

● ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



చెరకు కూలీలను ఢీకొన్న కంటైనర్

నారాయణవనం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన చెరకు కట్టలు పేర్చుతున్న కూలీలపైకి కంటైనరు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ కూలీ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. నారాయణవనం మండలంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. నైనారు కండ్రిగ వద్ద చెరకు తోటలో చెన్నైలోని విల్లుపురానికి చెందిన రాజన్(55), తనికవేలు ఉదయం 6 గంటల ప్రాంతంలో చెరకు గడలను తీసుకొచ్చి రోడ్డుపై పేర్చుతున్నారు. చెన్నై నుంచి తిరుపతి వైపుగా వస్తున్న లారీ కంటైనర్ నేరుగా వారిని ఢీకొట్టింది. పేర్చిన చెరకు గడలకు, లారీకి మధ్యలో రాజన్ నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తనికవేలు తలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూలో యూజీసీ బృందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగాన్ని యూజీసీ బృందం పరిశీలించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం దూరవిద్య విభాగం నిర్వహణ, కోర్సులు, బోధన, విద్యార్థులు, స్టడీ మెటీరియల్, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, సిబ్బంది, పనితీరు వంటి పలు వివరాలను పరిశీలించారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. దూరవిద్యా విభాగ అభివృద్ధి, ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. దూరవిద్య పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో సెనేట్ హాల్లో సమావేశమై పలు వివరాలను తెలుసుకున్నారు. డీఎస్టీ పర్స్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ బృందంతో ఆచార్య అశ్విని మహాపాత్ర, ఆచార్య రాజేంద్ర, ఆచార్య అరింద్ రనడే, యూజీసీ డిప్యూటీ సెక్రెటరీ వినోద్ సింగ్ యాదవ్ ఉన్నారు. వీరికి దూరవిద్య ప్రగతిని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, దూరవిద్యా డైరెక్టర్ తవమణి వివరించారు. ఈ పర్యటన తర్వాత దూరవిద్యకు గుర్తింపును ప్రకటించే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్వీయూ దూరవిద్యను పరిశీలిస్తున్న యూజీసీ బృందం

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని నూతన ఆవిష్కరణలు చేపట్టి భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక స్వర్ణాంధ్రభారతి పాఠశాలలో సైన్స్ సిఫోజియంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని నూతన ఆలోచనలతో మానవాళికి ఉపయోగపడేలా కొత్త అంశాలను కనుగొనాలన్నారు. ఈ తరహా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తిని, ఆలోచనా పరిజ్ఞానాన్ని పెంపొందించవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలను తిలకించి, వాటి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నవకోటి నాయుడు, సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధు, తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు



లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

గూడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నిర్వీర్యం అయిన విద్యావ్యవస్థను తిరిగి గాడిలో పెట్టి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చర్యలు చేపట్టారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు వెంకటేష్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టడంతో మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేశ్ కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం, ఫలితాలను మెరుగుపరిచేందుకు, విద్యావ్యవస్థను పటిష్ట పరిచేందుకు మంత్రి లోకేశ్ చర్యలు చేపట్టారన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టడం చారిత్రక నిర్ణయమన్నారు. కార్యక్రమంలో లల్లా, జీవన్, ధనుష్, జయ, శ్రీను, జగదీష్, వినయ్, మురళి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్, వేదికపై ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి

దక్కిలి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): దక్కిలి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మొక్కుబడిగా జరిగింది. ఉదయం 10 గంటలకు మొదలు కావాల్సిన సమావేశం కోరం లేకపోవడంతో రెండు గంటలు ఆలస్యంగా మొదలైంది. 10 గంటలకు ఎంపీపీ గోను రాజశేఖర్, వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి మాత్రమే హాజరయ్యారు. అధికారులు ఎంపీటీసీ సభ్యులందరికీ ఫోన్లు చేసి సమావేశానికి రావాలని కోరినా ఎవ్వరూ స్పందించలేదు. 12 గంటలకు తీర్థంపాడు ఎంపీటీసీ మెట్టుకూరు భారతి, దగ్గవోలు ఎంపీటీసీ పరందాయ్య హాజరవడంతో కోరం సరిపోయింది. దీంతో 12.20కి సమావేశం ప్రారంభం కాగానే తీర్థంపాడు ఎంపీటీ సభ్యురాలు భారతి సంతకం చేసి ఏదో పని ఉందంటూ వెళ్లిపోయారు. దగ్గవోలు ఎపీటీసీ సభ్యుడు పరుశురామయ్య కూడా కొద్దిసేపటికే బయటకెళ్లిపోయారు. మిగిలిన సభ్యులెవరూ సమస్యలపై సభలో నోరు మెదపకపోవడంతో అధికారులు శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడారు. చివరగా ఎంపీపీ గోను రాజశేఖర్ మాట్లాడుతూ పార్టీల కతీతంగా అభివృద్ధికి కృషి చేద్దామని చెప్పి సభను ముగించేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాల్లో రోడ్లన్నీ దెబ్బతిని, పారిశుధ్యం క్షీణించి జనం జ్వరాలతో బాధపడుతున్నారు. మరోవైపు గ్రామాల్లో మౌలిక వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అయితే ప్రజాప్రతినిధులు మాత్రం తమకేమీ పట్టనట్లు మండల సర్వసభ్య సమావేశానికి డుమ్మా కొట్టడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి.

రమణారెడ్డి మృతి టీడీపీకి తీరని లోటు



రమణారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాశిం, తానంకి నానాజీ

చిల్లకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని రామారెడ్డి పాళెంలో మృతి చెందిన ఎస్వీ రమణారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రమణారెడ్డి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ టీడీపీ బలోపేతానికి కృషి చేశారన్నారు. అలాంటి నాయకుడి మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో పెంచలకోన ఆలయ ట్రస్ట్ మాజీ చైర్మన్ తానంకి నానాజీ, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, మునిశేఖర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలపట్టు చెరువుల తూములను బాగు చేయించండి

దొరవారిసత్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నేలపట్టు చెరువుల తూములను బాగు చేయించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు రైతులు విజ్ఞప్తి చేశారు. ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్ల పరిశీలన కోసం నేలపట్టు పక్షుల కేంద్రంలో జిల్లా కలెక్టర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పక్షులు విడిది చేసే చెరువుల కింద వరి సాగు చేస్తున్న రైతులు కలెక్టర్ వద్దకు వచ్చి తమ సమస్యలను వివరించారు. చెరువుల్లో తూముల లీకేజీ కారణంగా నీళ్లు వృథాగా వెళ్లిపోతున్నట్లు తెలిపారు. చెరువులో నుంచి వృథాగా పోతున్న నీటిని చెరువు కట్ట మీద నుంచి కలెక్టర్‌కు చూపించారు. కలెక్టర్ స్పందిస్తూ వేసవిలో పక్షులు లేని సమయంలో చెరువుల తూముల మరమ్మతులు చేయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

బాల్య వివాహాల నియంత్రణకు కమిటీలు

కోట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాల నియంత్రణకు మండలాల వారీగా కమిటీలు వేయనున్నామని, ఇందుకు ప్రజల సాకారం అవసరమని సీడీపీవో మునికుమారి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోర బాలికల వికాశంపై అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా పోలీసులు, వైద్య ఆరోగ్యసిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలికలకు విద్య ఆవశ్యకత, మానసిక ఆరోగ్యం, ఆత్మరక్షణ, భద్రత, జీవనోపాధి అవకాశాలు, యోగా తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండితేనే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలు, మహిళా విద్యను ప్రోత్సహించడం, తదితర అంశాలపై తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శైలజ, మస్తానయ్య, సూపర్ వైజర్లు కృష్ణమ్మ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

పడిపోయిన వెనామి ధరలు

కోట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పండుగలు వచ్చే సమయానికే ఏటా రొయ్యల ధరలు పడిపోవడం పరిపాటిగా మారింది. సంక్రాంతి పండుగలు వారం రోజులు ఉండగా వేనామి రొయ్యల ధరలు తగ్గిపోయాయి. చెన్నై, నెల్లూరు, కడలూరు, పాండిచ్చేరి, రొయ్యల మార్కెట్లలో ధరలు పడిపోయాయని బయ్యర్లు ప్రచారం చేయడంతో కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లో రొయ్యల విక్రయాలు ఆగిపోయాయి. మంగళవారం నాటికి 270 ఉన్న 100 కౌంట్ రొయ్య రూ.240, 90 కౌంట్ ఉన్న రొయ్య రూ.250, 80 కౌంట్ ఉన్న రొయ్య రూ.270 70 కౌంట్ ఉన్న రొయ్య రూ.310, 60 కౌంట్ ఉన్న రొయ్య రూ.340, 50 కౌంట్ ఉన్న రొయ్య రూ.360 40 కౌంట్ రొయ్య రూ.390కు పడిపోయాయి. ఒక్కోక్క రొయ్య కౌంట్‌పై రూ.30 నుంచి రూ.40 వరకు వెనామి రొయ్యల ధరలు పడిపోవడంతో రైతులు లబోదిబోమంటూ గుండెలు బాదుకుంటున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

రాగివైరు అపహరణ

పెళ్లకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నప్ప నాయుడుపేట గ్రామానికి చెందిన రైతు నలుగూరు విద్యాసాగర్ పొలాల్లో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులో ఉన్న రాగివైరుతో పాటు ఆయిల్‌ను అపహరించుకుని వెళ్లారు. బాధిత రైతు మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పక్షుల పండుగ గుర్తుండేలా

సూళ్లూరుపేటను అభివృద్ధి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, వేదికపై ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి , మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, డీఆర్వో నరసింహులు, డీఎఫ్‌వో హారిక తదితరులు

సూళ్లూరుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా నిర్వహించే పక్షుల పండుగ గుర్తుండేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ చొరవతీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌కేఎస్ కల్యాణ మండపంలో పక్షుల పండుగ నిర్వహణపై జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్వో నరసింహులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పక్షుల పండుగను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ వాకాటి మాట్లాడుతూ సూళ్లూరుపేట మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ బాగాలేదని, డివైడర్ల మధ్యలో ఉన్న చెట్లను తొలిగించారని, పక్షుల పండుగ లోపు డివైడర్ల నడుమ మొక్కలు నాటే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. పక్షుల పండుగ గుర్తుండేలా అభివృద్ధి పనులు చేయాలన్నారు. కలెక్టర్ స్పందిస్తూ మున్సిపాలిటీలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ పండుగకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచ్చేసే అవకాశమున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. పులికాట్ సరస్సు ప్రాంతాల్లో ఉన్న వేనాడు, కొరిడి-పేర్నాడు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేసేందుకు కలెక్టర్ చొరతీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రణాళిక బద్ధంగా పక్షుల పండుగ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకొంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, డీఎఫ్‌వో హారిక, టూరిజం అధికారి జనార్ధనరెడ్డి, తహసీల్దార్ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం: జేసీ శుభం భన్సల్



సదస్సులో మహిళ ఇచ్చిన అర్జీని పరిశీలిస్తున్న జేసీ శుభం భన్సల్

ఓజిలి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ అన్నారు. ఓజిలి మండలం పున్నేపల్లిలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భూ ఆక్రమణలు ఇతర సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. అందులో భాగంగానే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని, భూములకు రక్షణ కల్పించేలా ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు ప్రజల వద్దకు వెళ్లి వారి భూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు జేసీ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు పద్మావతి, ఆర్ఐ విజయకుమార్, వీఆర్వో దిలీప్, టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, నెమళ్లపూడి నాయకులు కొప్పల మునిరాజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పడవ కాలువల పూడికతీత నిధులు మంజూరుకు కృషి

తడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పడవ కాలువల్లో పూడికతీతకు సంబంధించి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి భీములవారిపాళెం పడవలరేవును సందర్శించిన కలెక్టర్‌ను స్థానిక నాయకులు, గ్రామస్తులు కలిసి సమస్యలను వివరించారు. పడవ కాలువల పూడిక తీయించాలని, హైవే నుంచి పడవల రేవు వరకు రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటన్నింటికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. తిరిగి వెళ్తూ జాతీయ రహదారి పక్కన ఇబ్బడిముబ్బడిగా చెత్తా చెదారం పడేయడంపై ఎంపీడీవో విజయకుమార్‌ను ప్రశ్నించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసేవారిని గుర్తించి రూ.2 లక్షల వరకు జరిమానా విధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ నాగరాజు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీపీ కొలవి రఘురెడ్డి, టీడీపీ నాయకులు బొమ్మన శ్రీధర్, సెల్వం, పళణి, సుధాకర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వేనాడు రోడ్డుకు మరమ్మతులు చేయించండి

అటకానితిప్ప - వేనాడు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించాలని వేనాడు గ్రామస్తులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. అటకానితిప్పకు వచ్చిన ఆయనకు వేనాడు రోడ్డు దుస్థితి గురించి వివరించారు. స్పందించిన కలెక్టర్ రోడ్డును పరిశీలించారు. మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నాయకుడు సుదర్శన్ తదితరులు ఉన్నారు.

మూడు మండలాల్లో కలెక్టర్ పర్యటన



నేలపట్టు పక్షుల కేంద్రం పరిశీలనలో కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర శాఖల అధికారులు

దొరవారిసత్రం/సూళ్లూరుపేట/తడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లను పరిశీలించేందుకు దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల్లో మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్ పర్యటించారు. నేలపట్టులోని ఈసీ కేంద్రం, రోడ్లు, చెరువు కట్టలను పరిశీలించారు. పక్షుల కేంద్రంలోని రెండు మంచి నీటి చెరువుల్లో విడిదిలో ఉన్న పక్షులను వీక్షించారు. టూరిజం గైడ్ హుస్సేన్ ద్వారా పక్షుల రకాల గురించి తెలుసుకొన్నారు. పక్షుల పండుగ కోసం వచ్చే సందర్శకులకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించమని సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, జిల్లా స్థాయి అధికారులు, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐ సంఘమేశ్వరరావు, నేలపట్టు ఎంఆర్‌వో సౌజన్య, తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, పులికాట్, నేలపట్టుకు వచ్చే వలస పక్షుల కోసం పర్యావరణ ధ్యేయంగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. సూళ్లూరుపేట, తడ మండలాల్లో మంగళవారం ఆయన ఎమ్మెల్యే, అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, డీఎల్‌డీవో వాణి, తహశీల్దార్ నరసింహులు, డీఏవో రవికుమార్, ఏపీవో నాగరాజు, సీఐ మురళీకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవ నాయుడు, బీజేపీ నాయకులు ఆదినాయణ రెడ్డి, కిరణ్‌కుమార్, తడ మండలంలో ఎమ్మెల్యే, జిల్లా అధికారులతో పాటు స్థానిక నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, సంచి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులు మొదలు పెట్టండి

దక్కిలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దక్కిలి మండలం ఆల్తూరుపాడు గ్రామం వద్ద అర్ధాంతరంగా ఆగిపోయిన సోమశిల - స్వర్ణముఖి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిర్మాణం పనులు మొదలు పెట్టాలని ఏపీ ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ గద్దల మునెయ్య కోరారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సోమశిల - స్వర్ణముఖి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు ఆల్తూరుపాడులో నిర్మించాలని రూ.400 కోట్లు నిధులు విడుదల చేసిందని గుర్తుచేశారు. పనులు కూడా కొంత మేర జరిగాయని, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రిజర్వాయ పనులు జరగకుండా అడ్డుకొందని విమర్శించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రిజర్వాయరు నిర్మాణ పనులు మొదలవుతామని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. గతంలో రిజర్వాయరు నిర్మాణంలో భాగంగా ఆల్తూరుపాడు చెరువు కట్టను తొలించారని, అప్పటి నుంచి చెరువులో నీళ్లు నిల్వ చేసుకొనే అవకాశం లేక రైతులు పంటలు సాగు చేయలేక పొలాలన్నీ బీడుగా వదిలేశారని చెప్పారు. ఈ విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, మండల సర్వేయర్ రాజగోపాల్, టీడీపీ నాయకులు ముద్దా మునిస్వామి రెడ్డి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా దయాకర్



దయాకర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా దయాకర్ ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక నరశింగరావుపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గూడూరు పట్టణ అధ్యక్షుడిగా దయాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనను బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, విశ్వనాథం, పనబాక కోటేశ్వరరావు, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, బిందురెడ్డి, మనోజ్‌కుమార్, రవీంద్రరాజు, బాలకృష్ణ నిరంజన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ ఫిర్యాదుపై చర్యలు

పెళ్లకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరులో మేతపోరంబోకు భూముల ఆక్రమణపై ఇటీవల సర్పంచు పగడాల హరిబాబురెడ్డి గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. మంగళవారం మండల సర్వేయర్ పూజిత, వీఆర్వో వంశీకృష్ణ, సచివాలయ సర్వేయర్ లక్ష్మణ్ మేతపోరంబోకు భూములను సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేశారు.

చుక్కల భూములను పరిశీలించిన జేసీ

చిట్టమూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆలేటిపాడు గ్రామంలోచుక్కల భూములను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ మంగళవారం పరిశీలించారు. ఈయన వెంట తహసీల్దారు విజయలక్ష్మి, రీసర్వే డీటీ నిరంజన్‌కుమార్, వీఆర్వో నరేష్ తదితరులు ఉన్నారు.

11, 12 తేదీల్లో జిల్లా క్రికెట్ లీగ్ జట్టు ఎంపిక

గూడూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈ నెల 11, 12 తేదీల్లో అండర్-17, అండర్-23 జిల్లా క్రికెట్ లీగ్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి తెలిపారు. పాల్గొనదలిచినవారు 9985233061 నెంబరును సంప్రదించాలన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

గూడూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన బుజ్జయ్య(65) సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిమాపక ప్రమాదాలపై అవగాహన

వెంకటగిరి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక ప్రమాదాలపై అప్రమతంగా ఉండాలని 9వ బెటాలియన్ కమాండెంట్ అరుణ్‌బోస్ అన్నారు. మంగళవారం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి

గూడూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకుడు ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శశికుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

చిట్టమూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారిపాకదిబ్బ సమీపంలో కొక్కు శ్రీనివాసులు వద్ద 9 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు వాకాడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



ఆర్ఆర్ ట్రేడర్స్ ముందు ఆందోళన చేస్తున్న బాధితులకు నచ్చచెబుతున్న పోలీసులు

ఆఫర్ల పేరుతో ఘరానా మోసం

రూ.లక్షలు కట్టించుకొని పరార్



ఆర్ఆర్ ట్రేడర్స్ దుకాణానికి తాళాలు వేసి ఉన్న దృశ్యం

కోట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏ వస్తువు కొన్నా సగం ధరకే ఇస్తామని, ఆ వస్తువులను ఇంటికే తీసుకొనివచ్చి డెలివరి చేస్తామని ఓ సంస్థ నమ్మబలికింది. ఆఫర్లలో చవకగా వచ్చే వస్తువుల కోసం ఆశపడిన ప్రజలు పోటాపోటీగా వేల రూపాయల చొప్పున చెల్లించిన నెల రోజులకే బోర్డు తిప్పేసిన సంఘటన కోట పట్టణంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.... చెన్నైకు చెందిన ఆర్ఆర్ ట్రేడర్స్ అండ్ ఆర్డర్స్ సంస్థ కోట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో రెండు దుకాణాలతో ఫర్నిచర్ వ్యాపారం ప్రారంభించింది. చెన్నై కేంద్రంగా వ్యాపారం చేసే తమ దుకాణాల్లో ఏ వస్తువు కొనుగోలు చేసినా సగం ధరలకే ఇస్తామని ప్రచారం చేసింది. దీంతో కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన వందలాది మంది వేల నుంచి లక్షల్లో డబ్బులు కట్టారు. పది రోజులకే కొంతమందికి చెప్పిన సమయానికి వస్తువులు అందజేశారు. రెండు రోజుల నుంచి కోటలోని ఆర్ఆర్ దుకాణాలకు తాళాలు వేసి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. మోసపోయామన్న అనుమానంతో దుకాణం వద్దకు చేరుకుని లబోదిబోమంటూ గుండెలు బాదుకున్నారు. డబ్బులు కట్టిన వారంతా ఒక్కసారిగా దుకాణం వద్దకు చేరుకోవడంతో పోలీసులు వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఫిర్యాదు చేస్తే నిర్వాహకుల మీద కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో బాలింత మృతి



నాగలక్ష్మి మృతదేహం

నాయుడుపేట టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై బాలింత నాగలక్ష్మి(27) మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.... పట్టణంలో తుమ్మూరులో నివాసం ఉంటున్న నాగలక్ష్మి నెల క్రితం ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతుండటంతో వైద్యం చేయించుకునేందుకు భర్త కిష్టయ్య, బిడ్డతో కలిసి సోమవారం సాయంత్రం నెల్లూరుకు బయలుదేరారు. వీరు నాయుడుపేట రైల్వేస్టేషన్‌కు చేరుకునే సమయానికి రైలు వెళ్లిపోయింది. దీంతో భార్య, భర్తలు, బిడ్డ రాత్రిపూట రైల్వేస్టేషన్‌లో నిద్రించారు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి నాగలక్ష్మి మృతి చెంది ఉండడంతో భర్త కిష్టయ్య కన్నీరుమున్నీరయ్యారు. నాగలక్ష్మి మృతదేహాన్ని రైల్వే పోలీసులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రముఖ వస్త్ర వ్యాపారి దొంతు వెంకటేశ్వర్లు మృతి



వెంకటేశ్వర్లు(ఫైల్‌ఫొటో)

వెంకటగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వెంకటగిరికి పట్టణానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి దొంతు వెంకటేశ్వర్లు(70) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారుజాము తుదిశ్వాస విడిచారు. వెంకటేశ్వరావు మృతి చెందారని తెలుసుకొన్న పలురు ప్రముఖులు ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఫోన్‌లో వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ నెల 9వ తేదీన ఉదయం 9 గంటలకు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆరుగురు ఉపాధి సిబ్బంది సస్పెన్షన్

దొరవారిసత్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.13 కోట్ల ఉపాధి పనుల్లో సిబ్బంది అవినీతికి పాల్పడడంపై డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వార్షిక సామాజిక తనిఖీ నిర్వహించారు. టెక్నికల్ అసిస్టెంట్లు షమీఉల్లా, కోటేశ్వరరావు, మునీంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్లు చిట్టిబాబు, వెంకటేశ్వర్లు, ధనుంజయను సస్పెండ్ చేశారు. రూ.7.75 లక్షల రికరీ చేయాలని ఆదేశాలిచ్చారు. సీసీ రోడ్ల నిర్మాణానికి ముందస్తుగా నిధులు మంజూరు చేయడం, రికార్డులు సక్రమంగా నమోదు చేయకపోవడంపై పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లను మందలించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శివయ్య, సోషల్ ఆడిట్ విభాగం ఎస్ఆర్‌పీ రవి, ఎంపీడీవో గోవర్ధన్, ఏపీవోలు భాస్కరయ్య, ఉషా, భాస్కర్ పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. మంగళవారం కళాశాలలో విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర కళాశాలల క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నారాయణరాజు, అమ్మాజీ, రవీంద్రబాబు, సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.